2nd pages111.qxd 5/17/2025 8:16 PM Page 1

Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు,
నిడదవోలు,
దేవరపల్లి మండలాలకు
విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 9100986584, 9553574250

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 196 విశాఖపట్నం, 18 మే 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

# ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

## సీఎం చంద్రబాబు వెల్లడి



**కర్నూలు, విశాఖ సమాచారం:** రాష్ట్రంలోని మహిళలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుయం కల్పిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలులో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉద్యోగులు కూడా ప్రతినెలా మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు.

**అన్ని నియోజకవర్గాల్లో రైతు బజార్లు**

'రైతుబజార్లను 1999లో నేనే ఏర్పాటు చేశాను. రైతులకు గిట్టుబాటుధర రావాలి.. వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందజేయాలనే ఒక మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేశాం. మేం తెచ్చిన రైతు బజార్ల వల్ల రైతులు లబ్ధి పొందారు, వినియోగదారులకు కూడా ఎంతో మేలు జరిగింది. కర్నూలు సి క్యాంప్ రైతు బజారును రూ.6 కోట్లతో ఆదర్శ రైతుబజారుగా అభివృద్ధి చేస్తాం. పక్కనే ఉన్న స్థలంలో అండర్ గ్రౌండ్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తాం. రాష్ట్రంలో ఇప్పటి వరకు 125 రైతు బజారులు ఉన్నాయి. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రైతు బజార్లకు సేంద్రియసాగులో పండించిన కూరగాయలు వచ్చేలా చూస్తాం.

**ప్రపంచం గర్వించేలా యోగా డే నిర్వహిస్తాం..**

ప్రపంచం గర్వించేలా విశాఖలో యోగా డే నిర్వహిస్తాం.. ప్రధాని మోదీ కూడా వస్తున్నారు. యోగా దేను నెలరోజులపాటు నిర్వహిస్తాం. ప్రజలకు శిక్షణ ఇస్తాం. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట యోగా చేయాలని కోరుతున్నా. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ ఇస్తాం. నెట్ జీరో వేస్ట్ కోసం ప్రజలంతా ఆలోచించాలి. ప్రపంచంలో ఏ వస్తువూ వృథా కాదు.. అన్నీ ఏదో ఒక రూపంలో ఉపయోగపడతాయి. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేయాలి. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాలని ఆదేశించా. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నాం.. రెండు ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి. రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కడపలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. డ్వాక్రా, మెప్మా మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్నారు. గ్రామాల్లో చెత్తను ఎరువుగా మార్చే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. చెత్తను వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తే.. వాటిని మళ్లీ వాడతారు. జపాన్‌లో ఎక్కడా రోడ్ల మీద కాగితం కనిపించదు.. అదీ సామాజిక బాధ్యత. ఆ దేశంలో రోడ్డుపై ...(మిగతా 2లో)

# హరిత నగరంగా అమరావతి

## దేశంలోనే తొలిసారి ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్



**అమరావతి, విశాఖ సమాచారం: :** రాజధాని అమరావతిని హరిత నగరంగా మార్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దేశంలోనే తొలిసారి అమరావతిలో భారీ ఎత్తున ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరుగుతోంది. ఇందులో భాగంగా అమరావతిలో రోడ్ల నిర్మాణాలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. అంటే.. అడ్డుగా ఉన్న చెట్లను ట్రీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతి ద్వారా తొలగిస్తున్నారు. ఈ పద్ధతిలో చెట్ల కొమ్మలను కత్తిరించి, చుట్టూ తవ్వి కొంతమేర వేళ్లను కత్తిరిస్తున్నారు. అనంతరం వేరు వ్యవస్థ కుళ్లిపోకుండా ఫంగ్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. వేరు చుట్టూ ఉన్న మట్టి సహా చెట్టును క్రేన్ సహాయంతో తొలగించి చుట్టూ గోనె సంచి చుడుతున్నారు. ఈ క్రమంలో ఆ చెట్లను నర్సరీకి తరలించి, పెద్ద ప్లాస్టిక్ సంచుల్లో కోకోపిట్, ఎర్రమట్టి, ఎరువులు కలిపిన మిశ్రమాన్ని నింపుతున్నారు. డ్రిప్ ద్వారా నీటి తడులు అందిస్తున్నారు. ఈ పద్ధతిలో సాధారణంగా బతికే అవకాశం 40 శాతమే ఉంటుంది. ప్రత్యేక చర్యల ద్వారా 85 శాతం వరకు నమోద్కైంది. ఆ చెట్లను తుళ్లూరు మండలం అనంవరంలోని ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటరుకు తరలిస్తున్నారు. అక్కడ వేల సంఖ్యలో చెట్లను సంరక్షిస్తున్నారు. అనంతరం వాటిని రాజధానిలోని గ్రీన్ జోన్లలో నాటుతారు.

## రేపు డిప్యూటీ మేయర్ ఎన్నికకు

# ప్రత్యేక సమావేశం

### జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ వెల్లడి



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాట్లలోఎటువంటి లోపాలు లేకుండా సర్వం సిద్ధం చేయాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ జివిఎంసి అధికారులను ఆదేశించారు. శనివారం ...(మిగతా 2లో)

## పార్టీలో లోకేశ్‌కు

# కీలక బాధ్యతలు?

### టీడీపీ మహానాడులో నిర్ణయించే అవకాశం



**అమరావతి, విశాఖ సమాచారం:** చరిత్రలో నిలిచిపోయేలా కడపలో టీడీపీ మహానాడు నిర్వహించాలని అధిష్ఠానం తీర్మానించింది. సీమలో టీడీపీ మహానాడు నిర్వహించనుండటం ఆ ప్రాంతంలో ఉన్న తెలుగు తమ్ముళ్లలో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతేడాది ఎలక్షన్ కోడ్ కారణంగా మహానాడు నిర్వహించడం సాధ్యం కాలేదు. ఈ ఏడాది మే 27,28,29 తేదీల్లో మహానాడును నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు పోలిట్ బ్యూరో సమావేశంలో చెప్పారు. కాగా.. ఇప్పుడు మహానాడులో నారా లోకేశ్‌కు యువతకు సంబంధించిన కీలక బాధ్యతల్ని అప్పగించాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. యువతకు ప్రాధాన్యత ఇస్తూ, కొత్త తరం నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా ...(మిగతా 2లో)

# న్యూఢిల్లీలో 'జై హింద్ చక్ర' ఏర్పాటు

## వ్యర్థాలతో అద్భుత కళాత్మక సృష్టి




**న్యూఢిల్లీ, విశాఖసమాచారమ్ :** దేశం గర్వించే విధంగా, పర్యావరణ స్పృహను సూచించేలా స్క్రాప్ లోహాలతో రూపొందించిన అద్భుతమైన శిల్పం 'జై హింద్ చక్ర'ను న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంట్ హౌస్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ కళాత్మక సృష్టిని భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ ఎల్ సీ ఇండియా లిమిటెడ్ స్వచ్ఛతా హి సేవా 4.0 ప్రచారంలో భాగంగా రూపొందించి అభివృద్ధి చేసింది. ఈ కట్టడంలో మొత్తం 125 రాడ్లు, 250 చక్రాలు ఉపయోగించారు. 10 అడుగుల ఎత్తు ఉండే విగ్రహం 2.5. అడుగుల భూమి లోతు వరకు ఉంటుంది. ఈ కళాఖండం, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ గురించి అవగాహనను ప్రోత్సహించే లక్ష్యంతో భారత త్రివర్ణ పతాకం రంగులు, స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఇది జాతీయ సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యం పట్ల ...(మిగతా 2లో)

## వీసా గడువు మించితే

# బహిష్కరణ వేటే

### అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరిక




**ఢిల్లీ:** నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. బహిష్కరణ ముప్పు తప్పదని, అదే విధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఎంబసీ పోస్టు పెట్టింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే.. భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తివ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఏవైనా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ...(మిగతా 2లో)



# పాక్‌కు గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ అరెస్ట్

**హరియాణా:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై హరియాణాలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒక మహిళా యూట్యూబర్ కూడా ఉన్నారని శనివారం వెల్లడించారు. వీరంతా పాక్ నిఘా సంస్థ ఐఎస్‌ఐకు చెందినవారితో తరచూ సంప్రదింపులు జరుపుతున్నారని, శత్రు దేశానికి సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారని తెలిపారు. ఆ ఆరుగురిని హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి అదుపులోకి తీసుకున్నారు. వారిలో హిస్సార్ ప్రాంతానికి చెందిన జ్యోతి మల్హోత్రా అనే ...(మిగతా 2లో)

# ఇక పాక్‌పై దౌత్యయుద్ధం

## శశిథరూర్ సహా ఏడుగురు ఎంపీలతో విదేశాలకు బ్రీఫింగ్



**ఢిల్లీ:** ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(బిజెపి), బైజయంత్ పాండా (బిజెపి) సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ - ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన) విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక ...(మిగతా 2లో)



## అమెరికాలో తెలుగుభాషాభివృద్ధికి చప్ప గాంధీ విశేష కృషి

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** అమెరికాలో స్థిరపడిన మన తెలుగువారు చప్ప గాంధీ దంపతులు శనివారం విశాఖ సమాచారమ్ కార్యాలయాన్ని సందర్శించారు. చప్ప గాంధీ వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయినప్పటికీ అమెరికాలో తెలుగుభాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. 26 సంవత్సరాల క్రితమే ఆయన యుఎస్ఏ వెళ్లినప్పటికీ తెలుగుభాష, సంస్కృతిపై మక్కువతో ఎంఏ తెలుగు (ప్రైవేటుగా) చదువుతున్నారు. కవిగా, రచయితగా మంచి పేరుతెచ్చుకున్నారు. అక్కడ 'మన బడి' కార్యక్రమం ద్వారా ఎందరో పిల్లలకు తెలుగు భాష నేర్పిస్తున్నారు. అమెరికాలో విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా కూడా సేవలందిస్తున్నారు. అక్కడి నుంచి వార్తా విశేషాలతో పాటు కథలు, కవితలు కూడా పంపిస్తుంటారు. ఇటీవల వారి స్వగ్రామం బొబ్బిలి సమీపంలోని కమ్మవలస గ్రామానికి వచ్చారు. శనివారం గాంధీ ఆయన శ్రీమతి మనోరమతో కలిసి విశాఖపట్నంలోని విశాఖ సమాచారమ్ కార్యాలయానికి వచ్చి సీఈవో గుమ్మడి వంశీ చక్రధర్, ఎడిటర్ జి.వి.రమణారెడ్డి, సబ్ ఎడిటర్ డాక్టర్ పి.వి.రామ్‌తో కాసేపు ముచ్చటించి వెళ్లారు.

## పార్టీలో లోకేశ్‌కు కీలక బాధ్యతలు?

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న ఈ మహానాడులోనే లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలని పార్టీ అధినాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, అండగా నిలబడే లోకేశ్.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకముందు నుంచే కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తూ.. 2014 ఎన్నికలకు ముందు నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యకర్తలెవరైనా సరే.. ప్రమాదంలో మరణించిన వెంటనే ఆర్థిక సహాయం అందేలా వారికి బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ.. కార్యకర్తల మనిషిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో ఆయనకు పార్టీ కార్యకలాపాలను చూసుకునే బాధ్యతలను అప్పగించాలన్న డిమాండ్ పెరిగింది. మూడు రోజులపాటు జరగనున్న మహానాడులో.. చివరి రోజున లోకేశ్‌కు కీలక బాధ్యతలపై చంద్రబాబు పకటన చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# పాకిస్థాన్‌ను 'ఉగ్రవాద' దేశంగా ప్రకటించాలి

## ఎంపీ కపిల్ సిబల్ సూచన



**ఢిల్లీ:** పాకిస్థాన్‌ను ఉగ్రవాదదేశంగా ప్రకటిస్తూ..చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (యుఏపీఏ)లో సవరణ చేయాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. భారత్‌కు అతిపెద్ద సమస్య ఉగ్రవాదం కాబట్టి దానిని పూర్తిగా పెకలించివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఐక్యరాజ్య సమితిలో సవరణ తీసుకువచ్చి..పాక్‌ను ఉగ్రవాద దేశంగా జాబితా చేస్తూ షెడ్యూల్‌ను జోడించాలని సూచించారు. ఉగ్రవాద నిర్మూలన భారత్- పాక్‌కే కాకుండా..ప్రపంచ దేశాల పురోగతికి ఉపయోగపడుతుందని సిబల్ అన్నారు. కశ్మీర్ ప్రజలు నిశ్చింతగా ఉండాలంటే భారత విదేశాంగ శాఖ ఈ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచ వేదికలపైకి వెళ్లినప్పుడు ఉగ్రవాద సమస్యపై వాటితో చర్చించాలని..ఉగ్రసంస్థలకు ప్రపంచ దేశాల నుంచి నిధులు అందకుండా అడ్డుకోవాలని సూచించారు. పాక్ ఉగ్రకుట్రలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టడానికి భారత్ నుంచి అఖిలపక్ష ప్రతినిధుల బృందాలను ప్రపంచ దేశాలకు పంపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిబల్ స్వాగతించారు. ప్రతిపక్షాలతో సమావేశంలో వారు ఇచ్చిన సూచనలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంగీకరించారని అన్నారు. ఈ విధంగా దేశంలోని అన్ని పార్టీలు ఉగ్రవాద నిర్మూలనకు ఏకమైనప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన అనంతరం భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. అయినప్పటికీ పాక్ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తుండడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మరోవైపు ఉగ్రవాదం-వాణిజ్యం, ఉగ్రవాదం-చర్చలు ఒకేసారి సాధ్యం కావని ప్రధాని మోదీ ఇప్పటికే పాక్‌కు స్పష్టం చేశారు. అణుబాంబు బెదిరింపుల్ని భారత్ సహించదని.. ఈ ముసుగులో విజృంభిస్తున్న ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన, నిర్ణయాత్మకమైన దాడి చేస్తుందని హెచ్చరించారు. భారత్ చేసిన దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందన్నారు. పాక్‌కు నిధులు ఇస్తే..వాటితో ఉగ్రవాదులను పోషిస్తుందని..కాబట్టి ఆ దేశానికి ఎటువంటి సహాయం చేయొద్దని ఐఎంఎఫ్‌ను కోరారు.



## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ముగ్గురి మృతి

**అన్నవరం, విశాఖ సమాచారం:** కాకినాడ జిల్లా తుని వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది . ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులంతా రాజమహేంద్రవరం అపోలో ఫార్మసీ ఉద్యోగులు. మృతులను రాజమహేంద్రవరానికి చెందిన గెద్దం రామరాజు, హాజరత్ వాలీ, తణుకుకు చెందిన వరాడ సుధీర్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ గోనా శివశంకర్, వెంకట సుబ్బారావును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సమావేశానికి హాజరై కారులో వారు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీ విశాఖపట్నం నుంచి మండపేటకు ఐరన్ లోడ్‌తో వెళ్తోంది.

### రోడ్డు ప్రమాదంపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి

ఈ ప్రమాదంలో ముగ్గురి మృతి పట్ల మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ముంబయి విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ సభ్యుల అరెస్టు

**ముంబై:** పహల్గాం ఘటన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది. తాజాగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. ఇండోనేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన ఐసిస్ సభ్యులు అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి విమానాశ్రయంలోని టెర్మినల్ 2 వద్ద వీరు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఇమిగ్రేషన్ బ్యూరో అధికారులు అడ్డుకున్నారు. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో స్థానిక పోలీసులు ఇప్పటికే వీరిని గాలిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో వీరు



భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అదే ప్రదేశంలో స్లీపర్ సెల్స్‌కు బాంబు తయారీ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు. వారిని పట్టుకోవడానికి సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు తెలుస్తోంది. కాగా రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడం కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ఏజెన్సీ చేస్తున్న ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ప్రధాన ముందడుగని తెలిపారు.

### జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న సోదాలు

పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ బృందాలు ఉగ్రవాదుల జాడ కోసం జమ్మూకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. శనివారం స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గండర్‌బాల్, బారాముల్లా సహా 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్‌లోని బబ్బర్ ఖల్సా ఉగ్రవాద సంస్థకు చెందిన 15 ప్రదేశాలపై ఎన్ఐఏ బృందాలు దాడులు చేశాయి.

## ఏసీబీ కోర్టుకు ధనుంజయ్, కృష్ణమోహన్

**విజయవాడ:** మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి (ఏ31), ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి (ఏ32)లను సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టుకు తరలించారు. వారిద్దరినీ జడ్జి ఎదుట హాజరు పరిచారు. అంతకుముందు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఇప్పటివరకు ఏడుగురిని సీఐడీ అరెస్టు చేసింది. ఇప్పటికే రాజ్ కెసిరెడ్డి, చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, దిలీప్, గోవిందప్ప, బాలాజీలను అరెస్టు చేసిన సీఐడీ.. శుక్రవారం రాత్రి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని అరెస్టు చేసింది. ఈ కేసులో వీరిద్దరూ కీలకంగా వ్యవహరించినట్లు సిట్ అధికారులు గుర్తించారు.

## రేపు డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్లో మే 19వ తేదీన జరుపబోవు డిప్యూటీ మేయర్ ఎన్నిక కు చేపడుతున్న ఏర్పాట్లను, తీసుకుంటున్న జాగ్రత్తల పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక ను మే 19వ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నిక కు తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు వివరిస్తూ డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశానికి కౌన్సిల్ సభ్యులు , ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 11.00 గంటల లోగా తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని, ఇతరులను ఎవరినీ కూడా సమావేశంలోనికి అనుమతించరని తెలిపారు. సభ్యులు తమ మొబైల్ ఫోన్ లను ఫ్లైట్ మోడ్ లో పెట్టుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించిన జీవీఎంసీ అధికారిక లైవ్ టెలీకాస్ట్ లింకు అందుబాటులో ఉంచుతామన్నారు . ఎన్నిక సోమవారం జరుగబోతున్నందున ఆరోజు జీవీఎంసీలో ఫ్రీ వెహికిల్ జోన్ అయినప్పటికీ సభ్యులు, అధికారుల వాహనాలను భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోనికి అనుమతిస్తామని ప్రిసైడింగ్ అధికారి తెలిపారు.

## వీసా గడువు మించితే బహిష్కరణ వేటే

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు ఏర్పడితే.. చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. కాగా.. అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. "అమెరికాలో 30 రోజులకు నిబంధనలకు మించి నివసిస్తున్న వారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు.అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి" అని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్క రోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని. వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

# ఇక పాక్‌పై దౌత్యయుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్ (Operation Sindoor)తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వీరు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

1. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు
2. పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరణ
3. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత
4. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం
5. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం "ఆపరేషన్ సిందూర్" పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది.

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

పేపర్ కనిపిస్తే ఇంటికి తీసుకెళ్లి చెత్తబుట్టలో వేస్తారు. మన రాష్ట్రంలో కూడా ప్రజల్లో చైతన్యం రావాలి" అని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, జిల్లా కలెక్టర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాక్‌కు గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

మహిళా యూట్యూబర్ కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం న్యాయస్థానం ఆమెకు ఐదురోజుల పోలీసు రిమాండ్ విధించింది. ఆమె ఒక ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్. ఆమె పాక్‌లో పలుమార్లు పర్యటించారు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో పాక్ వ్యక్తులతో దేశ భద్రతకు ముప్పు తెచ్చే సమాచారాన్ని చేరవేసిందని అధికారులు ఆరోపించారు. 2023లో పాక్‌కు వెళ్లిన బృందంలో తనను కూడా ఎంపిక చేశారని, అప్పుడు అహ్సన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను కలిశానని విచారణలో అంగీకరించినట్లు చెప్పారు. భారత్‌కు వచ్చిన తర్వాత అతడితో సంప్రదింపులు కొనసాగించింది. అహ్సన్ సూచన మేరకు ఆమె.. అలీ అహ్సన్ అనే వ్యక్తిని కలుసుకుంది. పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను ఆమెకు అతడు పరిచయం చేశాడని సమాచారం. ఎవరి కంటాపడకుండా ఉండేందుకు తన పాకిస్థానీ కాంటాక్ట్‌ల వివరాలను ఇతర పేర్లతో సేవ్ చేశానని ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమె నిరంతర సంబంధాలు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుందని పోలీసులు వెల్లడించారు. ఆమె పంపిన సమాచారం, ఇతరుల ప్రమేయం గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా.. అరెస్టయిన వారిలో పటియాలలోని ఖల్సా కళాశాలలో చదువుతోన్న దేవేంద్ర సింగ్ ధిల్లాన్ కూడా ఉన్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడని తెలుస్తోంది.

## కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారీ

### పరిశీలించిన సీఎం చంద్రబాబు



**కర్నూలు:** కర్నూలు జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు సి క్యాంప్ రైతుబజార్‌కు వెళ్లారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సి క్యాంప్ రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, పారిశుధ్య కార్మికు లతో మాట్లాడారు. కూర గాయల వ్యర్థాలతో ఎరువుల తయారీ ప్రక్రియను పరి లించారు. అనంతరం ధన లక్ష్మి నగర్‌లో ఉద్యానవనం అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు కర్నూలు చేరుకున్న సీఎం చంద్రబాబుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు.

## న్యూఢిల్లీలో 'జై హింద్ చక్ర' ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

అచంచలమైన నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది, అదే సమయంలో ప్రధానమంత్రి స్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుతమైన రీసైక్లింగ్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుంది. అద్దం-చిత్ర భావనను ఉపయోగించి రూపొందించిన ఈ శిల్పం ముందు, వెనుక రెండిరటి నుండి ఒకేలా కనిపిస్తుంది. భారత ప్రభుత్వ 'వేస్ట్ టు ఆర్ట్' చొరవకు అనుగుణంగా, పారిశ్రామిక వ్యర్థాలను విలువైన కళలుగా మార్చడానికి ఎన్ఎల్‌సిఐఎల్ అనేక సృజనాత్మక ప్రయత్నాలను చేపట్టింది. వీటిలో 'పునరుత్తన్ చరఖా పార్క్' అభివృద్ధి, స్క్రాప్ మెటీరియల్స్ నుండి తయారు చేసిన శిల్పాలు, నమూనాలను కలిగి ఉన్న థీమ్డ్ పార్క్. అదనంగా, ఉపయోగించని భవనాన్ని పునరుద్ధరించి ఎన్ఎల్‌సిఐఎల్ 'పరంపరియం' మ్యూజియంగా మార్చారు, ఇది స్థిరత్వాన్ని మరింత ప్రోత్సహిస్తుంది. జై హింద్ చక్రాన్ని గనుల నుండి సేకరించిన ఉపయోగించని హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ స్క్రాప్ మెటీరియల్‌లను ఉపయోగించారు. క్లచ్ ప్లేట్లు, బేరింగ్‌లు వంటి భాగాలు బలం, యాంత్రిక ఓర్పును సూచించడానికి ఉపయోగించారు. పైపులు, ట్యాంకులు నిర్మాణ స్థిరత్వాన్ని అందించాయి. ప్రత్యేక తయారీ పద్ధతులు శిల్పాన్ని దాని తుది కళాత్మక రూపంలోకి రూపొందించడంలో సహాయపడ్డాయి. కేవలం మూడు వారాల వ్యవధిలో పూర్తి చేసిన ఈ శిల్పం ఎన్ఎల్‌సిఐఎల్ సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లి పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో రూపొందించారు. ముఖ్యంగా, మార్చి 25, 2025న ప్రసారమైన మన్ కీ బాత్ 75వ ఎపిసోడ్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇలాంటి కళాకృతులను హైలైట్ చేశారు. భారతదేశ మైనింగ్ రంగంలో వ్యర్థాలను కళగా మార్చడం, సృజనాత్మకత, స్థిరత్వాన్ని పెంపొందించాలనే బొగ్గు, గనుల మంత్రి జి. కిషన్ రెడ్డి దార్శనికతకు ఇది అద్దం పడుతుంది. జై హింద్ చక్రం 'వ్యర్థాల నుండి కళ' ఉద్యమానికి ప్రతీకగా నిలుస్తుంది.

## భారత్, పాకిస్థాన్‌లు చర్చలు పునఃప్రారంభించాలి: రష్యా

**ఢిల్లీ:** భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఇరుదేశాలు పరస్పర చర్చలు జరపాలని ఇప్పటికే అమెరికా, చైనాలు భారత్‌కు సూచించాయి. తాజాగా రష్యా సైతం ఇదే సలహాను ఇచ్చింది. "ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలపై భారత్ -పాక్ ప్రత్యక్ష శాంతి ఒప్పంద చర్చలు జరపాలని ఆశిస్తున్నాం. ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం" అని రష్యన్ ఫెడరేషన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా స్పందిస్తూ.. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించింది. భారత్, పాక్ సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. భారత ప్రధాని నరేంద్రమోదీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతి మార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్, పాక్ ప్రత్యక్ష చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు కోరుకుంటున్నారని తెలిపింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు తమ మద్దతు పాక్‌కే అని తెగేసి చెప్పిన చైనా..ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణను మాత్రం సమర్థిస్తున్నట్లు పేర్కొంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ఈ విషయంపై భారత్ స్పందిస్తూ..పాకిస్థాన్‌తో చర్చలు ద్వైపాక్షికంగానే జరుగుతాయని, ఉగ్రవాదంపై మాత్రమే చర్చలుంటాయని స్పష్టం చేసింది. మరో వైపు భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. శాంతి కోసం దీనిని ప్రతిపాదిస్తున్నామని, అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పారు.

## నీరు పారిశుద్ధ్యం పై అధిక ప్రాధాన్యత నివ్వాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** ఇటీవల మేయర్ గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావుని, పెందుర్తి లోని తన కార్యాలయంలో శనివారం అనకాపల్లి కి చెందిన నోబుల్ చారిటీస్ వ్యవస్థాపక కార్యదర్శి, డాక్టర్ శరకడం నూకరాజు, చారిటీస్ ప్రతినిధులు కలిసి శాలువ తో ఘనంగా సత్కరించారు. నిరంతరం, అన్ని వార్డులు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసు కొని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్న మేయర్ శ్రీనివాసరావు ను డాక్టర్.నూకరాజు, మేయర్ శ్రీనివాసరావు , నీరు, పారిశుధ్యం పైఅధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వొక ప్రణాళిక ప్రకారం, అనకాపల్లి లోని అన్ని వార్డులను, పరిశీలించి , ఇక్కడ ఉన్న అనేక స్వచ్ఛంద సంస్థలు, స్కూల్ లు, కళాశాల ల విద్యార్థుల సహకారం తో, అనకాపల్లి ని, స్వచ్ఛ అనకాపల్లి గా తీర్చిదిద్దాలని ఆయన ఆకాక్షించారు. మేయర్ తనకు వీలున్నంత వరకు అందరి సహకారం తో అభివృద్ధి చేస్తానన్నారు


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నం. VSKP-ELG-TL-AC 25-26-04, తేది: 12.05.2025

పని పేరు: విశాఖపట్నం కోచింగ్ డిపో యొక్క 63 కోచ్‌లకు అధిక సామర్థ్యం గల IV కొప్లర్ (500 AMPS) మరియు 150 చ.మీటర్ల ఫీడర్ కేబుల్ ఏర్పాటు.

టెండరు విలువ (రూ): 41,22,896.40, బిడ్ సెక్యూరిటీ (రూ.): 82,500.00, పూర్తి చేయు కాలం: 120 రోజులు.

టెండరు ముగింపు తేది మరియు సమయం: 04.06.2025న 1330 గం.లకు, టెండర్లు తెరుచు తేది మరియు సమయం: 04.06.2025న 1600 గం.లకు

టెండరు డాక్యుమెంట్లో పూర్తి వివరాలు http://www.ireps.gov.in లో లభించును.

ఈ టెండరు కోసం జారీ చేయబడిన ఏవైనా సవరణల కోసం టెండరుదారులు వెబ్‌సైట్‌ను చూడగలరు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (జి), వాల్తేరు

PR-133/Q/25-26


## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ర్యాలీ నిర్వహించిన ఎంపీడీవో



**రావికమతం, (విశాఖ సమాచారమ్):–** స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం రావికమతం లో ఎంపీడీవో వెంకన్న బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో బృందం తడి చెత్త పొడి చెత్త కేంద్రం యొక్క నిర్వహణను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలం దరూ కూడా తడిచేత పొడిచేత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని అన్నారు అదేవిధంగా వేసవి కాలం దృశ్య ప్రతి ఒక్కరు కూడా వేసవి వేడిని తగ్గించే చర్యలను చేపట్టాలని తగు సూచనలు చేశారు పక్షులకు సమస్త జీవరాసులకు పశువులకు నీటి సదుపాయం కల్పించాలన్నారు కార్యక్రమంలో యుఓ పి ఆర్ డి బానోజీరావు ఇతర శాఖల సిబ్బంది స్థానిక సచివాలయ కార్యదర్శి కృష్ణ మోహన్, రాముునాయుడు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

## ఈ ప్రపంచానికి మన సత్తాను చాటిందే ఆపరేషన్ సింధూర్

### తిరంగా ర్యాలీలో టిడిపి పాడేరు ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి



**పాడేరు/జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):–** పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్ర మూకలు చేసిన దాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధూర్ పేరుతో జరిపిన దాడితో ఈ ప్రపంచానికి భారత్ సత్తా ఏంటో తెలిసిందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ (జాతీయ భద్రత కొరకు ప్రజల భాగస్వామ్యం) పేరుతో ప్రజలతో కలిసి తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు పాడేరులో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ తరపున నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి గడ్డి ఈశ్వరి భారతీయ జనతా పార్టీ తరపున జిల్లా అధ్యక్షులు శ్రీమతి మఠం శాంత కుమారి, జనసేన తరపున పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్చార్జ్ వంపూరు గంగులయ్య హాజరైన ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ నుంచి పాత బస్టాండ్ వరకు జాతీయ జెండాను చేతబట్టి జయహో భారత్, ఖబర్దార్ పాకిస్తాన్ అంటూ నినాదాలు చేస్తూ తిరంగా ర్యాలీ నిర్వహించారు.అత్యంత పొడవైన జాతీయ జెండాను ఈ ర్యాలీలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై కొట్టిన దొంగ దెబ్బకు భారత సైన్యం ఇచ్చిన సమాధానం అంతా గర్వించే విధంగా ఉందన్నారు. భారతీయులందరికీ రక్షకులుగా భారత ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోడీ తన చాకచక్యంతో పాకిస్తాన్ కుటిల నీతిని ప్రపంచానికి తెలియజేసేలా చేశారన్నారు. సైన్యం చేసిన వీరోచిత పోరాటం పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించిందన్నారు.అతి కొద్ది నిమిషాల్లోనే పాకిస్తాన్ లో ఉన్న వందకు పైగా ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి భారత సైన్యం తన సత్తా ఏంటో చాటి చెప్పిందన్నారు.ఆపరేషన్ సింధూర్ భారతీయులు గర్వించదగ్గగా మారిందన్నారు.

మురళి నాయక్ వంటి అనేకమంది వీరులు మన దేశం తరపున యుద్ధం చేసి అమరులయ్యారని వారందరికీ భారత జాతి జోహార్లు తెలియజేస్తుందన్నారు. వారి కుటుంబాలకు మనమంతా అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ ను భారత విజయం గా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మణి కుమారి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ బొర్ర నాగరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు బొర్రా విజయ రాణి, బిజెపి నాయకులు ఉమామహేశ్వర రావు, కృష్ణా రావు, రాజారావు, టిడిపి తెలుగు యువత అధ్యక్షులు డప్పోడి వెంకటరమణ (బుజ్జి) తెలుగుదేశం బిజెపి జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సై శేషగిరికి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక "అతి ఉత్కృష్ట మెడల్"



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):–** అనకాపల్లి జిల్లా డీసీఆర్‌బీలో అదనపు ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న శేషగిరి కి కేంద్ర ప్రభుత్వం నుంచి "అతి ఉత్కృష్ట మెడల్" లభించింది. ఈ అవార్డు ఉమ్మడి విశాఖ జిల్లా పోలీస్ స్టేషన్లలో ఆయన అందించిన సుదీర్ఘ, నిష్ఠాభరిత సేవలకు గుర్తింపుగా ఇవ్వబడింది.ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శేషగిరి కి పతకాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ లక్ష్మణ మూర్తి గారు పాల్గొన్నారు.ఈ అవార్డును అందుకున్న సందర్భంగా పోలీసు అధికారులు, జిల్లా పోలీసు అధికారుల సంఘ సభ్యులు శేషగిరి కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## వాల్తేర్ డిపో కండక్టర్, డ్రైవర్ నిజాయితీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగును బస్సులో మర్చిపోయిన ఓ ప్రయాణికురాలికి ఆర్టీసీ సిబ్బంది తిరిగి అప్పగించారు. 999 నంబర్ గల బస్సులో ప్రయాణించిన ఓ మహిళ ఐదు తులాల బంగారంతో పాటు దుస్తులున్న బ్యాగును బస్సులోనే మరిచిపోయి దిగిపోయింది. కొద్దిసేపటి తర్వాత బ్యాగును గమనించిన ఆ బస్సు కండక్టర్ జి.గిరిబాబు, డ్రైవర్ డి.ఎ.బాబు దానిని వాల్తేరు డిపో సూపరింటెండెంట్‌కు సెక్యూరిటీ సమక్షంలో అప్ప గించారు. తమ బ్యాగు పోగొట్టుకున్నట్లు గుర్తించిన ప్రయా ణికురాలి కుటుంబ సభ్యులు శుక్రవారం డిపోను సంప్రదించగా.. అధికారులు ఆ బ్యాగును వారికి అందజేశారు. దీంతో ఆనందం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు.. కండక్టర్, డ్రైవర్ల వివరాలు తెలుసుకుని వారు విధుల్లో ఉన్న బస్సు వద్దకు వెళ్లారు. అక్కడ వారికి ఘనంగా సన్మానించారు. అనంతరం సిబ్బంది చేతులమీదుగా తమ ఆభరణాలను తిరిగి తీసుకుని సంతోషించారు. ఆర్టీసీ ప్రతిష్టను పెంచిన కండక్టర్, డ్రైవర్‌ను డిపో యాజమాన్యంతో పాటు ఉద్యోగులు అభినందించారు.

## బోర్లకు శంకుస్థాపన

### కార్పొరేటర్ శ్రీనివాస్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):–** జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి వెళ్లే రహదారి , జన చైతన్య కాలనీలో వాకింగ్ ట్రాక్ దగ్గర ఎండాకాలంను దృష్టిలో పెట్టుకొని, రెండు చేతి బోర్లుకు గాజువాక శాసనసభ్యులు పల్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిచి వెళ్లే పాదచారులను దృష్టిలో పెట్టుకొని ఈ బోర్వెల్ వేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కరణం జగదీష్, బూత్ కన్వీనర్లు వెంకటరావు, సింగిడి సింహాచలం, భరత్, హ నిత, క్లస్టర్ ఇంచార్జ్ గల్లా రుద్రకుమార్, గల్లా నర్సింగరావు, సూర్య, కరణం బాలయోగి బూత్ కన్వీనర్, స్కూల్ కమిటీ చైర్మన్, జీవీఎంసీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సాలాపువానిపాలెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఆదేశాల మేరకు మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని 84 వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో సాలాపువానిపాలెం గ్రామంలో శనివారం నిర్వహించారు. కూటమి కార్యకర్తలు గ్రామ ప్రజలతో కలిసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని రోడ్డుపై చెత్త మట్టి ఇసుక వంటివి ఉండకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా మనం ఉన్న ప్రాంతాల్ని పరిశు భ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని లేకపోతే అనారోగ్యానికి గురికావాల్సి ఉంటుందని, అందువల్లే ప్రభుత్వం మూడవ శనివారం ఏదో ఒక ప్రాంతంలో ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రజలను భాగస్వామ్యం చేసి స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టి ప్రజల్లో చైతన్యం కలిగించినట్లయితే ప్రభుత్వం ఉద్దేశం నెరవేరినట్లు అవుతుందని అన్నారు. పరిశు భ్రంగా ఉండడం వల్ల ప్రభుత్వం గుర్తించి మరిన్ని నిధులు కేటాయించడానికి అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా నీలబాబు ప్రజలను కార్యకర్తలు నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాలాపు మోహన్, సాలాపు నాగరాజు, సాలాపు రమణ ,సాలాపు సుమన్,, అప్రెంటిస్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విమ్స్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

### -రోగులకు మజ్జిగ, ఓ ఆర్ ఎస్ పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు శనివారం రోగులకు మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్లను డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని విమ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల థీమ్ అయిన బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు వేసవి వేడి నుంచి ఎలా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించారు.. శరీరం డిహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్, మజ్జిగ వంటి పానీయాలను సేవిస్తుండాలని సూచించారు.. శరీరానికి చల్లదనాన్ని కలిగించే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు నెలవారి జీతం ఇప్పించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతం వీసీతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్యే సౌత్ జనసేన సిటీ కన్వీనర్ తనను కలిసిన అతిధి అధ్యాపకుల సంఘం నాయకులను ఉద్దేశించి తెలియజేశారు. వంశీకృష్ణ క్యాంప్ కార్యాలయంలో అతిధి అధ్యాపకులు ఈరోజు కలిసి తమ సమస్యలను జనసేన సిటీ కన్వీనర్ వంశీకృష్ణ శ్రీనివాస్ గారికి తెలియజేశారు. అధ్యాపకులు 2010 నుంచి అతిథిదేవకులుగా పనిచేస్తామని కూటమి ప్రభుత్వము ఇంటర్మీడియట్ గెస్ట్ లెక్చరర్ కు నెలకు 27,000 జీతాన్ని పెంచిన సందర్భంగా , ఆంధ్ర యూనివర్సిటీలోని అతిధి అధ్యాపకులు కూడా నెలవారీ జీతం యుజిసి నాన్స్ ప్రకారం ఇప్పించాలని వంశీకృష్ణ శ్రీనివాస్ గారిని కోరడం జరిగింది. అదే రకంగా రాష్ట్రంలో అనేక యూనివర్సిటీలు ఆదికవి నన్నయ నాగార్జున జేఎన్టీయూ కాకినాడ ఇతర యూనివర్సిటీలు కూడా గెస్ట్ ఫ్యాకల్టీ కి మంత్లీ రెండుమిరేషణ్ ఇస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వంశీకృష్ణ శ్రీనివాస్ గారు బీసీ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం సురేష్ మీనన్ డాక్టర్ శిరీష్ ,డాక్టర్ ప్రసాద్ డాక్టర్ గిరీష్, డాక్టర్ సురేంద్ర డాక్టర్ ప్రసాద్,డా రాయ్,డా నాయుడు తదితరులు పాల్గొన్నారు

## శ్రీకృష్ణ విద్యామందిర్‌లో పదవ తరగతి విద్యార్థుల హవా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** విశాఖపట్నం శ్రీకృష్ణ విద్యా మందిర్ పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి నెంబర్ వన్ గా నిలిచారని స్కూల్ కార్యదర్శి వి ఆర్ సత్యనారాయణ తెలిపారు. ద్వారకా నగర్ శ్రీకృష్ణ విద్యా మందిర్ స్కూల్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరై 60 మంది ఉత్తీర్ణత సాధించారని, వీరిలో కే సాయి చైత్ర 500/486 మార్కులు సాధించగా 28 మంది విద్యార్థులు 90 శాతం, మిగిలిన విద్యార్థులు ఫస్ట్ క్లాసులో పాస్ అయ్యారని తెలిపారు. విద్య వ్యాపారం కాకూడదన్న ఉద్దేశంతో తమ విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పిస్తున్నామన్నారు. చైర్మన్, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయులకు దేశ సాంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంతో పాటు భారతీయ విద్య అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసింది భారతీయ విద్యా కేంద్రం అన్నారు.

దేశవ్యాప్తంగా 27 వేల స్కూల్స్ ఉండగా లక్షన్నరమంది టీచర్లతో 30 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు ట్రైబల్ ఏరియా ఫిషర్ మెన్ ఏరియాలో సేవా ప్రాజెక్టు కింద ఫ్రీ సింగిల్ టీచర్ స్కూల్స్ ను కూడా నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో స్కూల్ డైరెక్టర్లు బి లక్ష్మీనారాయణ, అంజలి ప్రసాద్, స్వర్ణలత, కోశాధికారి వై శ్రీధర్, కరస్పాండెంట్ సి. సుబ్బారావు, స్కూల్ ప్రిన్సిపాల్ వి. నర్మద, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏవీఎస్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ప్రజాపోరు




కాకినాడ: సమస్యలపై ప్రజా భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని మేలుకొల్పేలా పోరుబాటకు వైఎస్సార్ సీపీ సిద్ధమవుతోంది. ఇందుకు పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా రానున్న రెండు నెలల్లో మండల, గ్రామ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే జూన్ లోగా ఇంకా మిగిలిన మండలాలు, జూలైకల్లా గ్రామ స్థాయి కమిటీల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. కాకినాడ డి-కన్వెన్షన్‌లో జరిగిన పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమవ్వాలనేది ప్రధాన అజెండాగా నిర్ణయించారు. ఇందుకోసం ప్రజల సమస్యలపై పార్టీ స్థానిక నాయకత్వాలు శాంతియుత పంథాలో నిరసన కార్యక్రమాలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వాన నిర్వహించిన ఆందోళనలపై ఈ సమీక్షలో చర్చించారు. ఇదే తరహాలో సమస్యలపై పోరుబాటకు సన్నద్ధం కావాలని నేతలకు బొత్స సూచించారు. జిల్లా స్థాయిలో సైతం పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించారు. దీని కోసం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 50 రోజుల కార్యక్రమాన్ని ఖరారు చేశారు. వచ్చే జూన్ 1 నుంచి ప్రతి 10 రోజులకు ఒక జిల్లాలో పార్టీ జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాలను ఐదు జిల్లాల్లో 50 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

ప్రధానంగా వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని బొత్స తెలిపారు. కళ్లాల్లో ధాన్యం ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయంపై ఈ సందర్భంగా చర్చించారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్న మాటలకు.. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితికి అసలు పొంతనే లేదని నేతలు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విషయంలో రైతుల ఇబ్బందులు తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, వారితో మాట్లాడి, అండగా నిలవాలని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు.

## పార్వతీపురం నియోజకవర్గ మహానాడును విజయవంతం చేయండి

### మహానాడులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

### పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపు




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):–** పార్వతీపురం రాయల్ కన్వెన్షన్ లో రేపు ఉదయం 10 గంటలకు జరగబోయే పార్వతీపురం నియోజకవర్గ మహానాడులో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పార్వతిపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. ప్రజలందరికీ పండగలు అంటే సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ ఇలా ఎన్నో పండగలు ఉన్నాయని, అయితే మన తెలుగు తమ్ముళ్లకు మహానాడు పెద్ద పండుగ అని, అటువంటి మహానాడు తలపించే విధంగా నియోజకవర్గ మహనాడును ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ పండుగను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహానాడులో భవిష్యత్తులో ఎటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామో, పథకాలు ఏ విధంగా అమలు చేస్తున్నామో ఇలా పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ మినీ మహానాడులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

2nd pages111.qxd 5/17/2025 8:16 PM Page 4



విశాఖ సమాచారమ్
ఆదివారం 18-5-2025

# ఫీ'జులుం'కు అడ్డుకట్ట!

పిల్లలు చదువుల్లో రాణించాలని, ఉన్నత స్థాయిలో వారి భవిష్యత్తు ఉండాలని తల్లిదండ్రులు కలలు కంటుంటారు. వారి చదువుల కోసం తమకు అంతటి ఆర్థిక స్తోమత లేకపోయినా, అవసరమైన ఖర్చులు తగ్గించుకుని లేదా అప్పులు చేసి, ఆస్తులు అమ్మి త్యాగం చేస్తుంటారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలనే ఆశ్రయించడం జరుగుతోంది. కానీ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ రానురాను మితిమీరిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్యపై ఇటీవల ఢిల్లీలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టడం చివరకు ఫలించింది. ఈ అత్యధిక ఫీజుల జులుంకు అడ్డుకట్ట వేయడానికి ఢిల్లీ ప్రభుత్వం ఫీజుల స్థిరీకరణ, నియంత్రణ బిల్లు 2025 ముసాయిదా బిల్లును అమలులోకి తీసుకురావడం సాహసోపేత నిర్ణయం అని చెప్పవచ్చు.

దీనివల్ల ఢిల్లీలోని 1677 పాఠశాలలు, ఎయిడెడ్, నాన్ ఎయిడెడ్ లేదా ప్రయివేట్ అయినా ఫీజులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకత్వం, విధానాన్ని నిర్ణయించడానికి వీలవుతుంది. ఈ నిబంధనలు అమలు చేయడానికి మూడు కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల మౌలిక సదుపాయాల ఆధారంగా మూడు సంవత్సరాల పాటు ఫీజులను ఈ ప్యానెళ్లు నిర్ణయిస్తాయి. ఫీజుల నిర్ణయంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాత్ర వహిస్తారు. ఢిల్లీలో ప్రైవేట్ స్కూళ్లు ఫీజులు గత మూడేళ్లలో 50 నుంచి 80 శాతం పెరిగాయి. ఢిల్లీలో సగానికి సగం స్కూళ్లన్నీ ప్రైవేట్‌వే. జాతీయ స్థాయిలో ఈ సంఖ్య మూడోవంతుగా ఉంది. ప్రభుత్వ స్కూళ్లలో చదువులకు కనీస వసతులు లేకపోవడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయించవలసి వస్తోంది. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం లేకపోవడం కూడా లోటు అవుతోంది. ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థుల అడ్మిషన్లు పరిశీలిస్తే రానురాను పెరుగుతున్నాయి.

2010లో 20 శాతం అడ్మిషన్ల నుంచి 2023లో 46% వరకు పెరగడం గమనార్హం. డిమాండ్‌కు తగ్గట్టు స్కూళ్ల చదువుల్లో నాణ్యత ఉండడం లేదు. చదువుల వ్యాపారంలో బోధన ఎంత నాసిరకంగా ఉన్నా లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో చదువులు అత్యంత ఖరీదుగా మారుతున్నాయి. జవాబుదారీతనం లోపిస్తోంది. ఆశావహుల్కెన మధ్య తరగతి వర్గాలు తక్కువ నాణ్యత కలిగిన చదువులకు ఎక్కువగా ఖర్చు పెట్టవలసి వస్తోంది. ఫీజులను భరించే స్తోమత లేక విద్యార్థుల తల్లిదండ్రులు నిస్సహాయంగా దిక్కులు చూస్తున్నారు. ఈ పరిస్థితిపై ఢిల్లీలోని ప్రైవేట్ స్కూళ్ల వ్యవహారంపై పరిశీలనకు ఏర్పాట్కెన జడ్జీ నేతృత్వ కమిటీ ఢిల్లీలో 449 ప్రైవేట్ స్కూళ్లు అత్యధిక ఫీజులను గుంజుతున్నాయని గుర్తించింది. అయితే దీనికి అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నారు. ప్రభుత్వ విధానపరమైన లోపాలే దీనికి కారణం. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు గత మూడేళ్లుగా 50 నుంచి 80 శాతం పెరిగాయని సర్వేలో తేలింది. దేశంలోని 309 జిల్లాలకు సంబంధించి 31,000 మంది విద్యార్థుల తల్లిదండ్రులను సర్వే చేయగా, 93 శాతం మంది తల్లిదండ్రులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ఫీజులను నియంత్రించలేక పోతున్నాయని నిందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి ఫీజుల భారం పై మార్చి, ఏప్రిల్ నెలల్లో 100 ఫిర్యాదులు అందాయని లోకల్ సర్కిల్స్ సంస్థాపకుడు సచిన్ టపారియా చెప్పారు. 8 శాతం మంది తమ పిల్లల స్కూలు ఫీజులు 80 శాతం వరకు పెరిగాయని చెప్పగా, 36% మంది 50 నుంచి 80% వరకు పెరిగాయని ఉదహరించారు. మరో 8 శాతం మంది 30 శాతం నుంచి 50% వరకు పెరిగాయని తెలిపారు. మొత్తం మీద 44% మంది తమ పిల్లల ఫీజులు గత మూడేళ్లలో 50% నుంచి 80% వరకు పెరిగాయని వివరించారు.

46 శాతం మంది ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో చర్చించినా ప్రయోజనం కనిపించలేదన్నారు. 47 శాతం మంది తమ రాష్ట్రాలు ఈ సమస్యను అసలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మొత్తం మీద 93% మంది రాష్ట్ర ప్రభుత్వాలు స్కూళ్ల ఫీజులను అదుపు చేయలేకపోతున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ స్కూళ్లు ముఖ్యంగా అంతర్జాతీయ ప్రమాణాల విద్యా విధానాన్ని ఏవైతే అందిస్తాయో ఆయా స్కూళ్లు అత్యధిక ఫీజులను గుంజుతున్నాయి. ధనిక వర్గాలు ఈ భారాన్ని తేలికగా భరించగలుగుతున్నారు. మధ్యతరగతి, సామాన్య వర్గాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పిల్లల చదువులకోసం అత్యవసరమైన ఖర్చులను తగ్గించుకోవడం లేదా అప్పు చేయడమో చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భరించగలిగే ఫీజులతో నాణ్యమైన విద్య పిల్లలకు అందేలా సహకరించాల్సిన అవసరం ఉంది. మౌలిక సౌకర్యాలు కూడా కల్పించవలసి ఉంది. ఈ ఫీజుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వ ఉత్తర్వులేవీ జారీ కాలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో విద్యా విభాగం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. విద్యామంత్రిత్వశాఖకు చెందిన యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యుడిఐఎస్ఇ) నివేదిక ప్రకారం దేశంలో 2023-24లో స్కూళ్లలో విద్యార్థుల నమోదు 24.8 కోట్లకు తగ్గిందని తేలింది. అంతకుముందటి సంవత్సరాలతో పోలిస్తే కోటి మంది స్కూళ్లకు వెళ్లడం లేదని తెలిసింది. ఇది 201819 తో పోలిస్తే 26.02 కోట్ల నుంచి 6% తగ్గినట్టు చెప్పవచ్చు. ఈ విధంగా నమోదు తగ్గిపోవడం ప్రస్తుత విద్యావిధానాల సమర్థ తపై ఆందోళన కలిగిస్తోంది.


పంచాంగం

**ఆదివారం 18-5-2025**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరము**
**ఉత్తరాణాయణం, వసంత రుతువు**
**వైశాఖ మాసం**

| | |
|---|---|
| తిథి | : బ. పంచమి ఉ. 5.58 |
| నక్షత్రం | : ఉత్తరాషాఢ సా. 6.53 |
| వర్జ్యం | : రా. 10.58 ల 12.36 |

# భారత దేశాన్ని ఏక రాజ్యంగా చేసిన చాణిక్యుడు

## చిరస్మరణీయులు



చాణిక్యుడు మౌర్య సామ్రాజ్యం మూలపురుషుడు చంద్రగుప్త చక్రవర్తికి గురువు,ప్రధాన మంత్రి.ఆయన రచించిన అర్థశాస్త్రం నేటికీ రాజనీతికి దర్పణంగా ఉంది.ముఖ్యంగా రాజకీయ శాస్త్రంగా భావించవచ్చు.రాజ్యపాలన ఎలా చేయాలి,గూఢాచారి వ్యవస్థను ఎలా నిర్వహించాలనే విషయం, రాజ్యవిస్తరణ,విదేశీయులతో ఎలా ప్రవర్తించాలో ప్రస్తావించారు.రాజనీతి శాస్త్రంతో పాటు ఆర్థిక, భౌతిక,మనస్తత్వ శాస్త్రాలను వివరించారు.రాజ్య ఆర్థిక అభివృద్ధికి సూచనలు చేసారు.తన ధర్మ,ఆర్థిక,నీతి శాస్త్రాలకూ మూలం బృహస్పతి, అంభి తదితరులు సూచించిన పాలనా తత్వశాస్త్ర గ్రంథాలని పేర్కొన్నారు.తన తండ్రి చణకుడు కూడా పాలనాతత్వ శాస్త్ర వేత్త అని పేర్కొన్నారు.

అర్థశాస్త్రంలో ముఖ్య సిద్ధాంతం మండలయోని. మండలయోనిలో సంక్లిష్టమైన రాజ మండలాన్ని కౌటిల్యుడు సృష్టించాడు. రాజ్యావతరణ మొదటి దశలో చిన్న చిన్న రాజ్యాలు పెద్ద పెద్ద రాజ్యాలుగా రూపొందడం కొరకు సంఘర్షణలు, యుద్ధాలు తప్పనిసరి అన్నాడు. చిన్న రాజ్యాలు పెద్ద రాజ్యాలుగా ఏర్పడవలెననే కాంక్షకు కారణం సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయ సుస్థిరమైన, దృఢమైన రాజ్యంగా ఏర్పడవలసిన ఆవశ్యకతను ప్రజలు గుర్తించటమే అంటాడు కౌటిల్యుడు. మండలయోనిలో రాజ్య విస్తరణను సాధించడమే కాక వివిధ రాజ్యాలమధ్య రాజ్యాధికార సమతౌల్యతను

సాధించడం ఈ సిద్ధాంతం వివరిస్తుంది. వివిధ రాజ్యాలతో కూడిన రాజమండలంలో బాహ్యంగా ఏకాంతరంగా వున్న రాజ్యాలను నేమిగా, తదనంతర రాజ్యాలను ఆకులుగా, విజుగీషులైన (రాజు) నేత తనను నాభిగా చేసుకొని నలుదిక్కులకు వ్యాపించాలన్నాడు. ప్రకృతి మండల వృత్తాలలో నాభిగా ఉన్న రాజును లేక రాజ్యాన్ని, చుట్టివున్న రాజ్యాలు సహజ శత్రువులు. వీరియెడల నాభిగా వున్న రాజు అత్యంత జాగరూకుడై ఉండాలన్నారు.

సహజ శత్రువులతో కూడిన వృత్తాన్ని ఆవరించి వున్న బాహ్య వృత్తంలోని రాజ్యాలు సహజ మిత్ర రాజ్యాలు. అంతేకాక విజిగీషునకు ఆవరించిఉన్న రెండవవృత్తంలోని (మిత్ర రాజ్యములు) వీరు సహజ శత్రువులు. విజిగీషు నాభిగా, సహజ శత్రువులు ఆకులుగా, సహజ మిత్ర రాజ్యాలు నేమిగా ప్రకృతి మండల చక్రం అతి సంక్లిష్టమైన అంతర్ రాజ్య సంబంధాలను విజిగీషు అతి జాగరూకతతో నిర్వహించవలసి వుంటుంది. మండలం రాజ్యాలు యుద్ధాలతో సతమతమై వుండటం సహజం.రాజ మండలంలో రాజకీయ యధాతస్థితికి ఏక్షణంలోనూ తావులేదు అంటాడు కౌటిల్యుడు. 18వ శతాబ్దం ఐరోపా రాజకీయాలలో బ్రిటీష్ రాజనీతిని పరిశీలిస్తే చాణుక్యుని ప్రకృతి మండలం సిద్ధాంతం ఎంత విశ్వజనీయమైనదో తెలుస్తుంది.

తక్షశిల విశ్వవిద్యాలయం ఆనాడు ప్రసిద్ధి చెందింది.చాణిక్యుడు "చాణిక్య నీతి దర్పణం" అనే సంస్కృత గ్రంథం రచించారు. ఆయన

చాణిక్యుడు తక్షశిల విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర అధ్యక్షుడు.ఆయనకు కౌటిల్యుడు,విష్ణుగుప్తుడు అని పేర్లు కూడా ఉన్నాయి.చంద్రగుప్తుడు నేతృత్వంలో భారతదేశాన్ని ఏక దేశంగా రూపొందించిన ఘనత చాణిక్యుడే.ఆయన క్రీస్తు పూర్వం 375 సంవత్సరంలో తక్షశీలలో జన్మించి దాదాపు 92 సంవత్సరాలు జీవించారు.పాటలీపుత్రలో నివసించి అక్కడే చనిపోయారు. నందరాజు మహా పద్మనందుడి కుమారులు చాణిక్యుడిని అవమానించడంతో వారిని నాశనం చేస్తానని శపథం చేసాడు. నందరాజు చిన్న భార్య మురకుమారుడు చంద్రగుప్తుడు నందరాజు మహాపద్మనందుడు పెద్ద భార్య కుమారులు ఎనిమిది మంది హీనంగా చూసేవారు.చంద్రగుప్తుడు చాణిక్యుని ఆశ్రయించడంతో అభయం ఇచ్చాడు. పర్వతరాజును మగధ రాజ్యంపైకి దాడి చెయ్యమని,సగం రాజ్యం ఇస్తామని చాణిక్యుడు ప్రోత్సహించారు.అతను పెద్ద సైన్యంతో దాడి చేసాడు. చాణిక్యుడు తన సైన్య విభాగంతో నవ నందులను సంహరించాడు.చంద్రగుప్తుడు , చాణిక్యుడిని వంచించి మగధ రాజ్యం మొత్తం స్వాధీనం చేసుకోవాలని పర్వత రాజు చూసాడు. మగధ రాజ్య ప్రధానమంత్రి రాక్షసమంత్రి పర్వత రాజు తో పోరాడి నందులు పతనమయ్యారని తెలిసి లొంగిపోయాడు.నందులను చంపాడని చాణిక్యుడి మీదకు విషకన్యను పంపాడు. అది తెలుసుకున్న చాణిక్యుడు ఆమెను పర్వతరాజు వద్దకు పంపాడు.అతను ఆమెను మోహించి విగతజీవుడయ్యాడు.దాంతో అతని కుమారుడు మలయకేతువు పరారయ్యాడు. చివరకు సమర్థుడైన రాక్షస మంత్రిని చంద్రగుప్తునకు ప్రధాన మంత్రిగా చేయాలని సంకల్పించాడు.అందుకు రాక్షసామాత్యుడ్ని అంగీకరింపజేసి మగధను సుస్థిరం చేసాడు. భారతదేశాన్ని ఏక చక్రాధిపత్యంలోకి తెచ్చి చంద్రగుప్తుడిని మొట్టమొదటి చక్రవర్తిని చేసిన ఘనత చాణిక్యునికే దక్కింది. అర్థ శాస్త్రంలో చాణిక్యుడు తనను పాలనాతత్వ శాస్త్ర వేత్త వంశీకుడిగా ఆయన చెప్పుకున్నారు. ఆయన రాసిన అర్థ శాస్త్రం తరువాత కాలంలో తక్షశిల విశ్వవిద్యాలయంలో భోధనా శాస్త్రంగా విద్యార్థులకు బోధించడం విశేషం.ఇప్పటికీ ఆయన చెప్పిన రాజనీతి ఆధునిక ప్రపంచానికి మార్గదర్శకం ఉంది. ఆయన చెప్పిన నీటిలో ముఖ్యాంశాలు కొన్ని పరిశీలిస్తే... సోమరితనం జ్ఞానవినాశనానికి దారితీస్తుందని అర్థశాస్త్రంలో తెలిపాడు. జీవితంలో సమస్యలను సకాలంలో పరిష్కరించకపోతే తిప్పలు తప్పవన్నారు.సంపద విషయంలో జాగర్త పాటించాలన్నారు.లేకపోతే నష్టం తప్పదన్నారు.కష్టపడే తత్వం లేకపోతే విజయం సాధించలేరన్నారు.అలాగే నాయకత్వ లక్షణం ప్రతి వారికీ అవసరమన్నారు. సంస్థలకు ముఖ్యంగా నాయకుడు ఉండాలన్నారు. ఆయన చెప్పిన ఈ సూత్రాలు నేటికీ ఆచలణాత్మకాలే.

**యం.వి.రామారావు ,8074129668**

# రుక్మిణి ప్రేమలేఖ

ప్రేమలేఖలెన్ని రకాలో అయినప్పటికీ మొట్టమొదటగా ఓ ప్రేమ లేఖ రాసినది మాత్రం ఓ మహిళ కావడం విశేషం. ఆమె మరెవరో కాదు...రుక్మిణి...కృష్ణపరమాత్మకు ప్రేమలేఖ రాసింది తనను పెళ్ళి చేసుకోమని....

స్త్రీత్వానికి వ్యాకరణం సిగ్గు. కానీ ఆ సిగ్గుని విడిచిపెట్టి ఈ లేఖ రాస్తున్నాను.

పురుషులలో ఉత్తముడివైన పురుషోత్తమా!...

నువ్వో సింహానివి...( నరసింహావతారాన్ని ఉద్దేశిస్తూ)!

బంగారం కోసం ఎవరైనా ఇష్టపడొచ్చు. అలాగే నేనూనూ నిన్ను పొందాలని ఇష్టపడుతున్నాను.

నీ వీరత్వం జగమెరిగినది. నాకూ తెలుసు.

నాకూ ఊహ తెలిసినప్పటినుంచీ నిన్నే నేను ప్రేమిస్తున్నాను.

అయినా నిన్ను ఇప్పటివరకూ నేను చూసింది లేదు. నువ్వుగా వచ్చి నన్ను పెళ్ళాడుతావని నిన్నే తలుస్తూ ఎన్నో పూజలు చేస్తున్నాను.

నువ్వో మాయవు. మహామాయవు. ఎక్కడో దాగి ఉండి నన్ను పాలించడానికి ఆలోచిస్తున్నావు కదూ...

ఇప్పుడు నన్ను వేరొకరికి ఇచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నారు. అందుకు ఏర్పాట్లూ జరుగుతున్నాయి. ఈ స్థితి నిస్సహాయస్థితి. నేనేమీ చేయలేక పోతున్నాను. నువ్వే నా గతివి. అందుకే సిగ్గు విడిచి ఈ లేఖ రాస్తున్నాను.

ఈ ప్రపంచంలో నిన్నెవరూ గెలవలేరు. నువ్వు ఓ గొప్ప యోధుడవు. సౌందర్యవంతుడివి. నీ గొప్పతనాన్ని చెవులారా విన్నాను.

నా కనులు నీ గాంభీర్యాన్నీ నీ హుందాతనాన్నీ చూడటానికి తహతహలాడుతున్నాయి.

నీ సద్గుణాలు మనసులోనూ హృదయంలోనూ నిండి ఉన్నాయి. కనుకనే నీన్నే నా భర్తగా చిత్రించుకున్నాను.

హే ముకుందా! ఓ నాయకా!

నీ కీర్తికాంతులు, నీ పారంపర్యం, నీ ఆనందమయ గుణం, ప్రపంచమంతా విస్తరించి ఉన్న ప్రజల ఆనందానికి కారణమైన ఓ నాయకా, నువ్వు ప్రేమమూర్తివి!

నీకు నువ్వే సాటి. నీ వీరత్వం మాటల్లో వర్ణించలేనిది! సహజసిద్ధంగానే నువ్వు దయాస్వరూపుడవు!

నీ మోహనరూపాన్నెలా పొగడటం... భువనమోహడవు...నీ గురించి ఇన్నింటినీ విన్న ఏ స్త్రీ అయినా నిన్నే తన భర్తగా ఊహించుకోదా?!

అందుకే కృష్ణా! వటపత్రసాయీ ! నిన్నే నా భర్తగా నిశ్చయించుకున్నాను. వరిస్తే నిన్నే వరించాలనుకున్నాను.

కనుక ఓ మాధవా! నక్క గుణాలున్న శిశుపాలుడు నా చేయి పట్టుకోకముందే నువ్వు నన్ను వరించి, రక్షించు.

పురుషోత్తమా! నేనిప్పటివరకూ చేపట్టిన వ్రతాలూ, పేదలకు చేసిన సాయాలూ, సాధువులను ప్రార్థించడాలూ, వారిని స్తుతించడాలూ, ప్రజలకు చేసిన సేవాకార్యాలూ, గ్రామ దేవతలు, ప్రపంచాన్ని సృష్టించిన భగవంతుడికీ భక్తితో చేసిన ఆరాధనా వమ్ముకాకూడదంటే నువ్వొచ్చి నన్ను వరించాల్సిందే!

ఎవరూ నిన్ను గెలవలేరు గోవిందా!

నేను కోరేదిదే! పెళ్ళికి ఒకరోజు ముందరే రహస్యంగా వచ్చి రాజులందరినీ గెలిచి నన్ను నువ్వు వరించాలి.

స్త్రీలనూ పిల్లలనూ కష్టపెట్టక యుద్ధం చేయాలని నువ్వనుకుంటే నేను నీకొక మార్గం చెప్తాను.

మా పెళ్ళితంతులో భాగంగా భారీ స్థాయిలో ఓ జాతర జరుగుతుంది. మా ఆచారాన్నిబట్టి పెళ్ళికూతురితో శ్రీ గౌరి (గిరిజా దేవి) పూజ చేయించడానికి ఆలయానికి తీసుకువెళ్తారు. ఈ సమయంలోనే నువ్వు నన్ను వరించాలి.

కృష్ణా! నీకు శరణు శరణు. ఈ జన్మలో నీ పాదధూళిని స్పర్శించే



భాగ్యం లభించకుంటే నేనీ తనువు చాలిస్తాను. మళ్ళీ మళ్ళీ జన్మిస్తూ నిన్ను పొందేవరకూ తపస్సు చేస్తూనే ఉంటాను. కానీ ఆ అవసరం రానివ్వక ఇప్పుడే ఈ జన్మలోనే నువ్వు నన్ను వరించాలి. నన్నాదుకోవాలి....

ఇట్టా సాగిన రుక్మిణి ఉత్తరాన్ని చదివి కృష్ణుడి కళ్ళు చెమ్మగిల్లాయి.

"నిన్ను పొందాలన్నదే నా ఆశ. నువ్వే నాకు రక్ష" అన్న మాటలు చెప్పడమే ఆలస్యం...తక్షణమే కృష్ణుడు తరలివెళ్ళి రుక్మిణిని వరించాడు.

**- యామిజాల జగదీశ్**

## చరిత్రలో ఈ రోజు (మే 18)

**సంఘటనలు:**

1642: కెనడా దేశంలోని రెండవ పెద్ద నగరమైన మాంట్రియల్ స్థాపించబడిరది.

1804: ఫ్రెంచ్ సెనేట్ నెపోలియన్ బోనపార్టెను చక్రవర్తిగా ప్రకటించింది

1830 : ఏనుగుల వీరాస్వామయ్య రచించిన కాశీ యాత్ర చరిత్ర విశేషాల మీద సమగ్రమైన రచన. తెలుగులో యాత్రాసాహిత్యానికి ఈ పుస్తకమే ఆద్యమని భావిస్తారు. ఈతని యాత్ర 18 మే, 1830 నుండి సెప్టెంబరు 3, 1831 వరకు అనగా "15 నెలల 15 రోజుల కాలం" నడిచింది. రచయితగా, విద్వాంసుడుగా, త్యాగమూర్తిగా పేరుమోసిన ఏనుగుల వీరాస్వామయ్య తన వెంట రెండు వందల మందికి యాత్రావకాశం కల్పించారు.

1860: చికాగోలో జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావేశం లో, అబ్రహం లింకన్ని అమెరికా అధ్యక్షుడుగా ప్రతిపాదించారు (నామినేటెడ్ ).

1910: హేలీ తోకచుక్క భూమి మీద నుంచి కనిపించి, సూర్యుని వైపు తరలిపోయింది.

1914: పనామా కాలువ ద్వారా కార్గో తో ప్రయాణించిన మొట్ట మొదటి స్టీం బోటు (ఆవిరితో నడిచే పడవ) పేరు మారినర్ .

1953:: జాక్వెలిన్ కోక్రన్ నార్త్ అమెరికన్ ఎఫ్-86 కనడేర్ విమానం రోజర్స్ డ్రై లేక్ (కాలిఫోర్నియా) మీదగా నడిపిన మొట్టమొదటి మహిళ. ఎఫ్-86 చేసే శబ్దానికి స్త్రీలు తట్టుకోలేరన్న వాదనను పటాపంచలు చేసింది.

1969: రోదసీ నౌక అపోలో 10 ని, ముగ్గురు రోదసీ యాత్రికుల (1. యూజీన్ ఎ. సెమన్, 2. థామస్ పి. స్టాఫర్డ, 3. జాన్ డబల్ యు. యంగ్) తో రోదసీ లోకి ప్రయోగించారు.

1980: 93 సంవత్సరాలు ప్రశాంతంగా ఉన్న, 9,677-అడుగుల ఎత్తున్న మౌంట్ సెయింట్ హెలెన్స్ అగ్నిపర్వతం (వాషింగ్టన్ రాష్ట్రము) పేలింది. అగ్నిపర్వతం పేలుడు హిరోషిమా పై వేసిన అణుబాంబు కంటే ఐదు వందల రెట్లు అధిక శక్తివంతమైనది. అగ్ని పర్వతం చిమ్మిన, ఆవిరి, బూడిద ఆకాశంలో 11 మైళ్ళఎత్తు దాటి, 160-మైళ్ళ వ్యాసార్థములో ఆకాశం అంతా చీకటి మయం అయింది. అగ్నిపర్వతం చుట్టూ ఉన్న అడవులు అంటుకుని, ఆర్పటానికి సాధ్యం కాలేదు. ఈ పేలుడులోను, తరువాత మరణించిన వారు 67 మంది.. ఈ పేలుడు, 1300 అడుగుల ఎత్తున పర్వతం మీద జరిగి, 57 మంది మరణించటమో, కనపడకుండా పోవటమో జరిగింది

1991: సోవియట్ సోయుజ్ అంతరిక్ష నౌకలో హెలెన్ షర్మన్ (మొట్ట మొదటి బ్రిటన్ మహిళ) అంతరిక్షంలోకి వెళ్ళింది.

2005: కువాయిట్ పార్లమెంట్ ఆడవారికి ఓటు హక్కు ఇచ్చింది.

2006: నేపాల్ రాజు అధికారాలను తగ్గించటానికి, నేపాల్ పార్లమెంట్ ఒక తీర్మానం చేసింది

2006: అంగోలాలో కలరా వ్యాపించింది.

2007: అంటార్కిటిక్ సముద్రంలో 700 కొత్త జీవులను కనుగొన్నారు.

2011: స్పేస్ షటిల్ ఎండీవర్ ఆఖరి సారిగా ? (చివరి ప్రయాణం) రోదసీలోకి వెళ్ళింది.

2012: అమెరికాకు చెందిన నాస్ డాక్ స్టాక్ ఎక్స్చేంజీలో, ఫేస్ బుక్ (సోషల్ నెట్ వర్క్ సంస్థ) 2012 మే 18 నాడు నమోదు అయింది.

2012: రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 54.90 స్థాయికి పడిపోయింది. రూపాయి - డాలరు మారకం విలువ చరిత్రలో, ఇది, అత్యంత తక్కువ స్థాయి.

జననాలు:

1850: ఆలివర్ హీవిసైడ్, భౌతిక శాస్త్రవేత్త. అయనోస్ఫియర్ అనేది ఒకటి ఉందని, అది రేడియో తరంగాలను పరావర్తింప చేస్తుందని ఊహించి చెప్పిన శాస్త్రవేత్త.

1877: కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, మొట్టమొదటి తెలుగు విజ్ఞాన సర్వస్వం నిర్మాత.

1883: జర్మన్ ఆర్కిటెక్ట్ (భవన నిర్మాత) వాల్టర్ గ్రోపియస్, బౌహాస్ స్కూలు స్థాపకుడు జననం.

1914: సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ, స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘసేవకురాలు

1916: సి.ఆర్.సుబ్బరామన్, తెలుగు సంగీత దర్శకుడు, నిర్మాత

1928: చలం(కోరాడ సింహాచలం), తెలుగు చలన చిత్ర నటుడు, నిర్మాత.

1932: దూపాటి సంపత్కుమారాచార్య, సత్తుపల్లి లోని శారదా విద్యానికేతన్ కులపతి, రచయిత, శతావధాని

1949: నరాల రామిరెడ్డి, సుప్రసిద్ధ తెలుగు అవధాని.

1959: బేతా సుధాకర్ , చలన చిత్ర నటుడు, నిర్మాత.

**మరణాలు:**

1886: అక్షయ్ కుమార్ దత్తా, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనమునకు ఆద్యులలో ఒకరు.

1986: కె.ఎల్.రావు, ఇంజనీరు, రాజకీయ నాయకుడు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాకారం కావడానికి ఈయన కృషి చేశారు.

1995: నటి ఎలిజబెత్ మాంట్ గోమెరి, లాస్ ఏంజిల్స్లో మరణించారు.

2007: జ్యోతి, దక్షిణ భారత చలన చిత్ర నటి

2014: పి.అంకమ్మ చౌదరి, హేతువాది, మానవతావాది. మానవతా విలువలున్న న్యాయమూర్తి.

2017: కె.కె.శర్మ, తెలుగు సినిమా నటుడు, రంగస్థల నటుడు.

2018: పెద్దిభొట్ల సుబ్బరామయ్య, కథారచయిత

2018: యద్దనపూడి సులోచనారాణి, నవలా రచయిత్రి.

## మరుగున పడుతున్న కొన్ని తెలుగు సామెతలు

47. అన్నపు చొరవే గాని అక్షరపు చొరవ లేదు
48. అప్పు చేసి పప్పు కూడు
49. అయ్య వారు వచ్చే వరకు అమావాస్య ఆగుతుందా
50. అయ్యవారిని చెయ్యబోతే కోతి బొమ్మ అయినట్లు
51. బతికుంటే బలుసాకు తినవచ్చు
52. భక్తి లేని పూజ పత్రి చేటు
53. బూడిదలో పోసిన పన్నీరు
54. చాదస్తపు మొగుడు చెబితే వినడు,
గిల్లితే యేడుస్తాడు
55. చాప కింద నీరులా
56. చచ్చినవాని కండ్లు చారెడు
57. చదివేస్తే ఉన్నమతి పోయినట్లు
58. విద్య లేని వాడు వింత పశువు
59. చేతకానమ్మకే చేష్టలు ఎక్కువ
60. చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు
61. చక్కనమ్మ చిక్కినా అందమే
62. చెడపకురా చెడేవు
63. చీకటి కొన్నాళ్ళువెలుగు కొన్నాళ్ళు
64. చెరువుకి నీటి ఆశ నీటికి చెరువు ఆశ
65. చింత చచ్చినా పులుపు చావ లేదు
66. చింతకాయలు అమ్మేదానికి సిరిమానం వస్తే,
ఆ వంకర టింకరవి యేమి కాయలని అడిగిందట
67. చిలికి చిలికి గాలివాన అయినట్లు
68. డబ్బుకు లోకం దాసోహం
69. దేవుడు వరం ఇచ్చినా పూజారి వరం ఇవ్వడు
70. దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళ వాన
71. దాసుని తప్పు దండంతో సరి
72. దెయ్యాలు వేదాలు పలికినట్లు
73. దిక్కు లేని వాడికి దేవుడే దిక్కు
74. దొంగకు దొంగ బుద్ధి, దొరకు దొర బుద్ధి
75. దొంగకు తేలు కుట్టినట్లు
76. దూరపు కొండలు నునుపు
77. దున్నపోతు మీద వర్షం కురిసినట్లు
78. దురాశ దుఃఖమునకు చెటు
79. ఈతకు మించిన లోతే లేదు
80. ఎవరికి వారే యమునా తీరే
81. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు.
82. గాడిద సంగీతానికి ఒంటె ఆశ్చర్యపడితే, ఒంటె అందానికి గాడిద మూర్ఛ పోయిందంట
83. గాజుల బేరం భోజనానికి సరి.

2nd pages111.qxd 5/17/2025 8:16 PM Page 5



# నెహ్రూనగర్‌లో స్వచ్ఛ సర్వేక్షన్



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):-** విశాఖ తూర్పు నియోజకవర్గం, 12వ వార్డు పరిధిలో గల నెహ్రూ నగర్ గ్రామం నందు ప్రతి నెలలో 3 వ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ - సర్వేక్షన్ వారోత్సవాలలో భాగంగా కూటమి నాయకులు పాల్గొని ప్రజలకు కొన్ని సూచనలు చెబుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని అలాగే ఈ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటికి రావద్దని, వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీటిని త్రాగాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడి సత్యం గారు, విశాఖ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు గారు, వార్డు సెక్రటరీ పోతిన భరత్, వార్డు ఉపాధ్యక్షులు కొత్తలి గోపాల్, రాగుల తిమోతి, పందిరి నర్సింగ్, పైడి మల్లేశ్వరరావు, రాపర్తి గణపతి, ధనాల ఈశ్వరరావు, రాజు,కాంతారావు, సచివాలయం శానిటేషన్ సిబ్బంది, సూపర్వైజర్లు,ఆర్పీలు, స్థానిక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ రహమాన్ జన్మదిన వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. ఏ. రహమాన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.శనివారం ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్లో ఈ వేడుకలు సంబరంగా జరిగాయి.డాక్టర్ రహమాన్,డాక్టర్ షిరీన్ రహ్మాన్ దంపతులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకల్లో ఆయన సన్నిహితులు అత్తిలి శంకర్రావు,గొలగాని రవీశ్వరరావు, మున్నం బాలాజీ, అబ్దుల్ చిన్న రహమాన్,జఫ్రుల్లా ఎన్. అప్పారావు, పిల్లి రమణ, సింహాద్రి, ఎస్.రాము, యాళ్ల శ్రీనివాసరావు, విజయ,రుకియా భాను,శారద,లక్ష్మి,దేవి బుదిల్ పార్కు మేనేజర్ వై. శ్రీనివాసరావు దితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రహమాన్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా. విశాఖపట్నం పాతబస్తీ ప్రజలతో తమ దంపతులకు ఉండే అనుబంధం ఇంతా అంతా కాదని ఈ నేపథ్యంలోనే ఓల్డ్ సిటీలో జన్మదిన వేడుకలు జరుపుకున్నట్లు తెలియజేశారు.మున్ముందు ప్రజలకు మరింత చేరువుగా ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతామని అన్నారు. పేదవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు మరింతగా పాటుపడతామని చెప్పారు. తన.జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో పోలీసుల శ్రమదానం

## పరిశుభ్రతకు నాంది పలికిన అనకాపల్లి జిల్లా పోలీసులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత ఎంతగానో అవసరం అనే దృక్పథంతో, అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్., వారి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ శ్రమదాన కార్యక్రమానికి ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రికార్డు గదులు మొదలైన ప్రాంతాలను శుభ్రపరిచారు. చెత్తను తొలగించి, మొక్కల చుట్టూ ఉన్న కలుపును తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, "స్వచ్ఛతే ఆరోగ్యానికి పునాది. ప్రతి ఒక్కరికి పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించటం పోలీసుల బాధ్యత గా తీసుకోవాలన్నారు." ప్రతి ఒక్కరు తమ నివాస ప్రాంతాలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా చెత్త నిర్వహణ కోసం ప్రత్యేక డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే సూచనలు, మొక్కలు నాటడం వంటి పలు చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏ.ఓ ఏ.రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, లక్ష్మీ, గఫూర్, రమేష్, రామకృష్ణారావు, మన్మధరావు, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, ఆదినారాయణ, అంజి బాబు, కార్యాలయ సూపరింటెండెంట్ గిరి తదితరులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అన్ని శాఖల ప్రతినిధులతో మాట్లాడకపోతే ఎలా ?

- మండల గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు
- మండల విద్యాశాఖ అధికారిని నిలదీసిన మత్స్యవానిపాలెం సర్పంచ్ గణేష్



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులచే మాట్లాడించలేని ఈ సర్వసభ్య సమావేశం తమకెందుకంటూ పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు ఎంతవరకు పరిష్కారం అయ్యాయో సభ ముందు తెలియ జేయాలని సభ్యులు పట్టుబట్టారు. అయినప్పటికీ దానిని దాటవేస్తూ సభను ప్రారంభించారు. రావికమతం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు పైల రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు గ్రామాలలో పేరుకుపోయిన సమస్యల పైన పలువురు సభ్యులు ఊగిపోయారు. ఈ సమావేశంలో ఆరోగ్య, వ్యవసాయ, గృహ నిర్మాణ, ఉపాధి హామీ, విద్యుత్తు, వెలుగు, విద్యా, ఆర్డబ్ల్యూఎస్, శాఖాధికారులు మినహా మిగిలిన శాఖల అధికారులు మాట్లాడకుండానే సభను ముగించడం పట్ల పలువురు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. గుడ్డిప,కన్నంపేట, యుపి స్కూల్ గ్రేడ్ను తగ్గించడం పట్ల ఆయా గ్రామాల సర్పంచులు మాకు తెలియకుండా ఏ విధంగా చేస్తారు అని వారు ప్రశ్నించారు. అలాగే మత్స్యవానిపాలెం స్కూలు సింగిల్ టీచర్తో నడవడం, అలాగే ప్రైమరీ స్కూల్ గా ఉంచాలని గత రెండు సభల నుంచి మొత్తుకున్న, కావలసిన పిల్లల సంఖ్యను కూడా అందిస్తామని సర్పంచ్ మలిచెట్ల గణేష్ చెప్పి సభ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ మా చేతుల్లో అవకాశం లేదని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ చేతులు దులుపుకున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తాను అని చెప్పినప్పటికీ సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో తక్షణమే స్పందించిన ఎంపీడీవో వెంకన్న బాబు మత్స్యవాన్ని పాలెం పాఠశాల సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆయన శాంతించారు. మండలంలో 14 సింగిల్ టీచర్ పాఠశాలలు నడుస్తున్నట్లు ఆయన చెప్పడం పట్ల చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు.అలాగే కొమ్మెర పాఠశాలలో మెనూ సరిగా జరగట్లేదని కొమర సర్పంచ్ గొర్లె రవికుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ విద్యుత్తు లైన్స్, అలాగే రావికమతం థియేటర్ వద్ద గ్రామంలోనూ విద్యుత్ సమస్య తరచూ తలెత్తుతుందని దానిని తక్షణమే పరిష్కరించాలంటూ రావికమతం సర్పంచ్ గెంజిమొద నాయుడు దృష్టికి తీసుకువచ్చారు అలాగే ఏజిఎల్ లైను నుంచి స్టేట్ లైన్ కూడా నిర్వహించడం చాలా దారుణమని పొన్నవోలు సర్పంచ్ విరోటి రాజారావు, మురపాక సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా సిసి రోడ్లన్నీ కట్ చేసేటప్పుడు వాటిని ఫిల్లింగ్ చేయడానికి ప్రత్యేకమైన నిధులు ఉంటాయి కదా ఎందుకు ఫీలింగ్ చేయట్లేదని ఆర్డబ్ల్యూఎస్ ఏఈని వైస్ ఎంపీపీ దంట్ల రమణ ప్రశ్నించారు. అలాగే మరుపాక పంచాయతీలో 800 మంది ఉపాధి శ్రామికుల పనిచేసిన పనిని ఎవరు లాగిన్ లో తీసివేశారో తక్షణమే తెలపాలంటూ మరుపాక ఎంపీటీసీ సూర్యనారాయణ, సర్పంచు సత్తిబాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఎంక్వయిరీ జరుగుతుందని బాధ్యుల పైన చర్య తీసుకుంటామని ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్న రావు తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు తమకు ఏ సమాచారాన్ని అందించడం లేదంటూ చీమలపాడు సర్పంచ్ వంజరి గంగరాజు, మత్స్యవానిపాలెం సర్పంచ్ గణేష్ వ్యవసాయ అధికారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు అన్నదాత సుఖీభవ ఈ కేవై వైసీ నిమిత్తం సుమారు రెండు కిలోమీటర్ల మేర వృద్ధులు, వికలాంగులు, మహిళలు కొమెర సచివాలయానికి కవగుంట గ్రామం నుంచి మండుటెండలో నడుచుకొని వెళ్లాలంటే చాలా ఇబ్బంది కాబట్టి రైతు సేవా కేంద్రం ఇన్చార్జి గ్రామంలోకి వచ్చి రైతులకు ఈకే వైసి చేయాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు తోపాటు, పలువురు సభ్యులు వ్యవసాయ శాఖ ఇన్చార్జిలు గ్రామాలకు వచ్చి ఈ కేవైసీలు జరిపించాలని సభా దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అనేకమైన రెవెన్యూ సమస్యలు ఉన్నప్పటికీ వాటిపైన మాట్లాడించడానికి అధికారులు దాటవేశారు. అలాగే ఆర్టీసీ, ఫారెస్ట్, ఇరిగేషన్, ఐసిడిఎస్, పీఆర్, హార్టికల్చర్, సెరికల్చరు, ఫైర్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, వెటర్నరీ, ఎక్సైజ్, సివిల్ సప్లై, తదితర శాఖల అధికారులు మాట్లాడాల్సి ఉండగా వీరు ఎవరు మాట్లాడకపోవడం పట్ల పలువురు ఎంపీటీసీలు,సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒక మారు జరిగే ఈ సమావేశంలో గ్రామాలలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి సంబంధిత అధికారుల ద్వారా తమ గ్రామాల సమస్య పరిష్కారం చేసుకోవాలని సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పటికీ వీటిని తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల సభ్యులు పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భవాని ప్రసాదు, రమణ,ఎంపీడీవో వెంకన్న బాబు, ఈ ఓ పి ఆర్ డి, బానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

# లాటరైట్ తవ్వకాల్లో అడుగడుగునా అక్రమాలే

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న



**నాతవరం, (విశాఖ సమాచారమ్):** లాటరైట్ తవ్వకాల్లో అడుగుఅడుగనా అక్రమాలే జరుగుతున్నాయని లాటరైట్ మైనింగ్ మాఫియాకు,మైనింగ్ అదికారులు పూర్తిగా దాసోహం అయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న పేర్కొన్నారు. శనివారం అయిన ఓ ప్రకటన విడుదల చేసారు,నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో లాటరైట్ తవ్వకాల్లో అడుగు అడుగున అవినీతి చోటు చేసుకుందని తెలిపారు లాటరైట్ తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో మైనింగ్ అదికారులు సక్రమంగా వ్యహరించ లెదని తెలిపారు, వెయ్‌బ్రిడ్జి ఏర్పాటు లేకపోవడం,అక్రమ మినరల్ విక్రయాలు, పర్మిట్ దుర్వినియోగం అయ్యిందని తెలిపారు,రవాణా నిబంధనల ఉల్లంఘనలు మరియు శాఖ అధికారులతో కలసిమెలసిన చర్యలపై తక్షణ విచారణ చేయాలని డిమాండ్ చేసారు,బమిడిక గ్రామంలోని 121 హెక్టార్ల లాటరైట్ గనిపై జార్ధా లక్ష్మణరావు నిర్వహిస్తున్న అనేక అక్రమ కార్యకలాపాలపై మైనింగ్ అదికారు కన్నెత్తి అయిన చూడక పోవడం దుర్మర్గ మన్నారు లాటరైట్ తవ్వకాలు వద్ద తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన వెయ్ బ్రిడ్జి ఇప్పటికీ ఏర్పాటు చేయలేదన్నారు,దీంతో మినరల్స్ చెల్లింపు మరియు రవాణా నిర్ధారణ లేకుండా జరుగుతోందని తెలిపారు.

రాయల్టీ పర్మిట్‌లు గనిలో డౌన్లోడ్ చేయకుండా, మాఫియాకు చెందిన సంస్థ లకు మినరల్స్‌ను నేరుగా విక్రయిస్తున్నారని అగ్రహారం వ్యక్తం చేశారు.

రవాణా వాహనాల్లో తప్ప నిసరి జీపీఎస్ పరికరాలు అమర్చ వలసి ఉందనీ ఆవిధంగా చేయలేదని తెలిపారు,రాయల్టీ పర్మిట్‌లు గనికి సంబంధం లేని ఇతర జిల్లాల నుండి డౌన్లోడ్ అవుతున్నాయని తెలిపారు. గనులు శాఖ అధికారుల సహకా రంతో ఈ అక్రమాలు జరుగుతు న్నట్లు స్పష్టంగా అర్థం మౌతుందని అన్నారు. సుస్థిర అభివృద్ధి చట్టం (2016)గనిలో వెయ్‌బ్రిడ్జి తప్పనిసరిగా ఉండాలని సూచిస్తుందని తెలిపారు. ఎం ఎం డి ఆర్ చట్టం 1957 సెక్షన్ 21(4)చట్టబద్ధమైన పర్మిట్ లేకుండా మినరల్స్ రవాణా చేయడాన్ని నిషేధించదని అన్నారు, ఏ పి మైనర్ మినరల్ కన్ సెక్షన్ రూల్స్,1966 రూల్ 26: వెయింగ్ నమోదు తప్పనిసరని తెలిపారు,రూల్ 29 అనధికార మినరల్ రవాణా నిషేధ మన్నారు

రవాణా నిబంధనలు: జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా వాహనాల్లో అమర్చాలని తెలిపారు. సుప్రీం కోర్ట్ తీర్పు గోవా ఫౌండేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2014) గనిలో కఠినమైన నియంత్రణ, వెయ్‌బ్రిడ్జి తప్పనిసరని పేర్కొన్నారు

ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ తీర్పు (డబ్ల్యూ పి నం. 32157/2013) గనిలో వెయ్‌బ్రిడ్జి ఉండటం, పర్మిట్ లావాదేవీల నిర్వహణ అవసరమని ధృవీకరించిందని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతుందని అన్నారు. బమిడిక గ్రామంలోని 121 హెక్టార్ల లాటరైట్ గనులు ప్రత్యక్ష తనిఖీ నిర్వహించిచాలి డిమాండ్ చేసారు,వెయ్‌బ్రిడ్జి ఏర్పాటు మరియు పని స్థితిని పరిశీలించాలి. పర్మిట్ జారీ ప్రక్రియను, పరిశీలించ వల్సిఉందన్నారు.

పర్మిట్‌లు ఏఐపి అడ్రస్‌ల నుంచి డౌన్లోడ్ అయ్యాయో లేదు పరిశీలించాలని కోరారు. పర్మిషన్ బదులు గని స్థలానికి బదులుగా ఇతర ప్రాంతాల నుంచి తవ్వకాలు చేపాడుతున్నది పరిశీంచవల్సి ఉందన్నారు రవాణా వాహనాలపై తనిఖీ వాహనాల్లో జీపీఎస్ పరికరాలు అమర్చ బడ్డాయా లేదా,అవి పని చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని తెలిపారు.శాఖ అధికారులపై విచారణ అధికారుల కలిసిమెలిసి చర్యలపై విచారణ జరిపి, తప్పు నిరూపిత మైతే కఠినమైన శాఖా మరియు న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు అంతవరకు గనిపై తాత్కాలికంగా కార్యకలాపాలను నిలిపివేయాల్సి ఉంటుందని తెలిపారు ఇన్ని పనులు మైనింగ్ అదికారులు చేయవలసిన ఉండగా ఇవి ఏమి చేయకుండానే అడ్డగోలుగా లాటరైట్ తవ్వకాలు చేపాట్టడం చట్టవిరుద్ధమన్నారు దినికి మైనింగ్ అదికారులు,లాటరైట్ మాఫియాకు దాసాహం అవ్వడం సిగ్గు చేటని ఇప్పటికైనా వెంటనే చర్యలు చేపాట్టాలని అప్పటి వరకు మైనింగ్ తవ్వకాలు వెంటనే ఆపాలని వెంకన్న డిమాండ్ చేసారు.

# కేజీహెచ్‌లో 40 బెడ్‌లతో నూతన వార్డు ప్రారంభం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రధాయని కేజీహెచ్ ప్రక్షాళన అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తనదైన శైలిలో ముద్ర వేస్తున్నారు. నిరంతరం రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం కేజీహెచ్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన శ్రీకారం చుట్టారు. 40 బెడ్ లతో కూడినటు వంటి క్యాజువాలిటీ డిపార్ట్మెంట్లో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషన్ సిస్టం లో ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే కమాండ్ కంట్రోల్ సిస్టంకు అనుసంధానిస్తూ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ప్రారంభించారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉద్యోగులు ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ కేజీహెచ్ లో ఎన్నడూ లేని విధంగా అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా, ఇటు ప్రభుత్వంతో అటు సి ఎస్ ఆర్ నిధులతో కేజీహెచ్ మరింత అద్భుతంగా తీర్చిదిద్దటమే తన లక్ష్యం అని చెప్పారు. రానున్న రోజులలో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయుటకు ప్రణాళిక రూపొందించామని తెలియజేశారు. సూపర్డెంట్ శివానంద్ గారు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంధ్యారాణి గారు, డిప్యూటీ సూపర్డెంట్లు, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ లు , అడ్మినిస్ట్రేటర్లు , ఆర్ ఎమ్ ఓ లు పాల్గొన్నారు..

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ - కరెంట్ ఎఫైర్స్

### ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్ విజేతకు ఇచ్చే ప్రైజ్‌మనీని నిర్ణయించిన ఐసీసీ

2025 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్ విజేతకు ఇచ్చే ప్రైజ్‌మనీని ఐసీసీ 3.6 మిలియన్ డాలర్లుగా (దాదాపుగా రూ.30 కోట్ల 80 లక్షలు) నిర్ణయించింది. దీంతోపాటు ఒక గద కూడా లభిస్తుంది. 2023తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. గత ఛాంపియన్ ఆస్ట్రేలియా 1.6 మిలియన్ డాలర్ల నగదు బహుమతిని అందుకుంది.

ఈసారి రన్నరప్‌గా నిలిచే జట్టు 2.1 మిలియన్ డాలర్లు (రూ.17 కోట్ల 94 లక్షలు) చేజిక్కించుకోనుంది. గత ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌కు 8 లక్షల డాలర్లు మాత్రమే లభించాయి. ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య జూన్ 11న లార్డ్స్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మొదలు కానుంది.

**14 మే**

**ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ప్రైజ్‌మనీ**

2025లో జరిగే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్ కోసం ఫిడే రూ.9.5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. ఫార్మాట్లోనూ మార్పులు చేసింది. అంతర్జాతీయ చెస్ క్యాలెండర్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఒకటైన ఈ ఛాంపియన్‌షిప్‌కు దోహా ఆతిథ్యమివ్వనుంది. ర్యాపిడ్ టోర్నీ ఫార్మాట్‌ను మార్చలేదు. ఓపెన్ విభాగంలో 13 రౌండ్లు, మహిళల విభాగంలో 11 రౌండ్లు ఉంటాయి. తొలి స్థానం కోసం టై ఏర్పడితే ప్లేఆఫ్ నిర్వహిస్తారు. బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కొత్తగా నాకౌట్ ఫార్మాట్‌ను ప్రవేశపెట్టారు. స్విస్ స్టేజ్ నుంచి నలుగురు క్రీడాకారులు నాకౌట్ సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. ఇంతకుముందు ఎనిమిది మంది ముందంజ వేసేవాళ్లు.

**ఖేలో ఇండియా యూత్ గేమ్స్**

పట్నాలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ టెన్నిస్‌లో తెలంగాణ అమ్మాయి రిషిత రెడ్డి స్వర్ణం గెలుచుకుంది. మే 14న జరిగిన ఫైనల్లో ఆమె 6-1, 2-6, 6-3తో ఐశ్వర్య జాదవ్‌పై విజయం సాధించింది. అంతకుముందు సెమీఫైనల్లో రిషిత 7-5, 6-1తో హర్షిని (కర్ణాటక)ని ఓడించింది. రిషిత, లక్ష్మీ సిరి జంట జూనియర్ ఐటీఎఫ్ విభాగం డబుల్స్‌లో రజత పతకం సాధించింది.

**13 మే**

**ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్**

ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టైలిష్ ఓపెనర్ స్మృతి మంధాన రెండో స్థానంలో నిలిచింది.శ్రీలంకలో భారత్ ముక్కోణపు సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన ఆమె ఒక ర్యాంకును మెరుగుపర్చుకుంది. సిరీస్‌లో స్మృతి అయిదు ఇన్నింగ్స్‌ల్లో 264 పరుగులు సాధించింది. ఫైనల్లో శ్రీలంకపై 101 బంతుల్లో 116 పరుగులు చేసింది. నంబర్‌వన్ బ్యాటర్ లారా వోల్వార్ట్‌కు ఆమె కేవలం 11 రేటింగ్ పాయింట్ల దూరంలో ఉంది. స్మృతి చివరిసారి 2019లో అగ్రస్థానం సాధించింది.

బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ నాలుగో స్థానంలో ఉంది. సోఫీ ఎకిల్‌స్టోన్ నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో ఆష్లీ గార్డ్‌నర్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది.

**11 మే**

**భారత మహిళలదే ముక్కోణపు సిరీస్**

**ఫైనల్లో శ్రీలంక పై విజయం**

భారత మహిళల జట్టు అదరగొట్టింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వన్డే ముక్కోణపు సిరీస్‌ను చేజిక్కించుకుంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (116బీ 101 బంతుల్లో 15ఐ4, 2ఐ6) మెరుపు శతకం బాదిన వేళ.. మే 11న ఏకపక్షంగా సాగిన ఫైనల్లో భారత్ 97 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. స్మృతి జోరుతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 342 పరుగుల భారీ స్కోరు సాధించింది. హర్లీన్ డియోల్ (47బీ 56 బంతుల్లో 4ఐ4), జెమీమా (44బీ 29 బంతుల్లో 4ఐ4), హర్మన్‌ప్రీత్ కౌర్ (41బీ 30 బంతుల్లో 4ఐ4, 1ఐ6) సత్తా చాటారు. మల్కీ మదార, దేవ్మీ విహంగ, సుగంధిక కుమారి తలో రెండు వికెట్లు పడగొట్టారు.

ఛేదనలో స్నేహ్ రాణా (4/38), అమన్‌జ్యోత్ (3/54) ధాటికి శ్రీలంక 48.2 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. చమరి ఆటపట్టు (51బీ 66 బంతుల్లో 6ఐ4, 1ఐ6) టాప్ స్కోరర్. స్మృతికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. స్నేహ్ రాణా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికైంది.

**ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ ప్రపంచకప్**

ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ ప్రపంచకప్‌లో కైనన్ చెనాయ్, సబీరా హారిస్ జోడీ మిక్స్‌డ్ ట్రాప్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో భారత ద్వయం 34-33తో టోల్గా టన్సర్-పెలిన్ కాయా (తుర్కియే) జంటను ఓడించింది. మిగతా విభాగాల్లో భారత్‌కు ఏ పతకాలు రాలేదు.

పురుషుల ట్రాప్ క్వాలిఫయర్స్‌లో కైనన్ షెనాయ్ (117) భారత్ తరఫున అత్యుత్తమంగా ముగించి 17వ స్థానం సాధించాడు. శార్దూల్ విహాన్ 62, భౌనీష్ మెండిరట్ట 65వ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో కృతి గుప్తా, రాజేశ్వరి కుమారి, సబీర హారిస్ కూడా ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు.

**ఆర్చరీ ప్రపంచకప్**

ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి దీపిక కుమారి, పార్థ్ సాలుంఖే సత్తాచాటారు. ప్రతిష్టాత్మక టోర్నీలో దీపిక, పార్థ్ కాంస్య పతకాలు సాధించారు. మే 11తో ముగిసిన ఈ టోర్నీలో భారత్ మొత్తం 7 పతకాలతో సత్తాచాటింది. మే 10న భారత కాంపౌండ్ అర్చర్లు అయిదు పతకాలతో అదరగొట్టగా.. ఆఖరి రోజు రికర్వ్ క్రీడాకారులు దీపిక, పార్థ్ రాణించారు. మహిళల రికర్వ్‌లో కాంస్య పతకం కోసం జరిగిన పోరులో దీపిక 7-3తో కాంగ్ యంగ్ (కొరియా)పై విజయం సాధించింది. పురుషుల విభాగంలో పార్థ్ 6-4తో బాప్టిస్ట్ అడిస్ (ఫ్రాన్స్)ను ఓడించి కాంస్యం గెలిచాడు.

**10 మే**

**ఆర్చరీ ప్రపంచకప్ కాంపౌండ్**

పురుషుల జట్టుకు పసిడి, సురేఖ, చికిత బృందానికి రజతం

ఆర్చరీ ప్రపంచకప్ కాంపౌండ్ విభాగంలో భారత్ రెండు స్వర్ణాలు సహా అయిదు పతకాలు గెలుచుకుంది. మహిళల వ్యక్తిగత విభాగంలో మధుర ధమాంగోంకర్ పసిడి సాధించింది. ఫైనల్లో ఆమె 139-138తో అమెరికాకు చెందిన కార్సన్ క్రహేను ఓడించింది. 24 ఏళ్ల మధుర టీమ్ రజతం, మిక్స్‌డ్ కాంస్యం కూడా గెలుచుకుంది. మహిళల టీమ్ ఈవెంట్ ఫైనల్లో మధుర, తెలుగమ్మాయిలు జ్యోతి సురేఖ, చికితజలతో కూడిన జట్టు 221-234తో మెక్సికో జట్టు చేతిలో పరాజయంపాలైంది.

ఇక మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక పోరులో మధుర, అభిషేక్ వర్మ జోడీ 144-142తో మలేసియా జంటపై గెలిచింది. అంతకుముందు పురుషుల టీమ్ ఈవెంట్లో స్వర్ణంతో భారత్ పతకాల వేట మొదలైంది.

2nd pages111.qxd 5/17/2025 8:16 PM Page 6



## సోలభం కొత్తూరు రోడ్డు జంక్షన్ నుండి కుడ్డింగి వరకు రహదారి మరమ్మత్తులు చేపట్టాలి



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):** అల్లూరి జిల్లా జిమాడుగుల మండలం సోలభం పంచాయితీ సోలభం కొత్తూరు జంక్షన్ నుండి కుడ్డింగి వరకు రహదారి మరమ్మతులకు గురై ఈ మార్గంలో పయనించే వాహన చోధకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు కిలోమీటరు న్నారా. పెద్ద పెద్ద గోతులు పడటంతో పాటు ఏ మాత్రం వర్షం పడి నా గోతులలో నీరు నిల్వ ఉండిపోయి రహదారి కనిపించక అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోధకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం ద్వారానే సోలభం. గడుతూ రు గెమ్మెలి పంచాయతీలలోని సుమారు 30 గ్రామాల ప్రజలు నిరంతరం ప్రయాణం సాగిస్తారు . ఈ గోకుల రహదారిలో ప్రయాణం సాగిస్తూ ప్రమాదాల గురవుతూ ఆసుపత్రులు పాలవుతున్నామని ఆ ప్రాంతం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు ఎమ్మెల్యే ఎంపీ స్పందించి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని గడుతురు సర్పంచ్ కొండపల్లి అప్పలమ్మ. టిడిపి నాయకులు కొండపల్లి సింహాచలం మాజీ ఎంపీటీసీ మాతె అప్పారావు కోరారు.

## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

### డి.ఆర్.ఓ. వై సత్యన్నారాయణ




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):** మన చుట్టూ ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగ ఉంచడం మన అందరి బాధ్యత అని జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు అన్నారు.ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో డిఆర్ఓ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ స్వచ్ఛందంగా చెత్తను తొలగిస్తూ సిబ్బందికి సందేశం ఇచ్చారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ. మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కో నినాదంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిచ్చారని గుర్తుచేసారు. అందులో భాగంగా ఈ నెల లిబీట్ ది హీట్లి నివాదంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. స్వచ్ఛతలో భాగంగా బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం డి.ఆర్.ఓ. కార్యాలయ సిబ్బందితొ స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చెయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం మరియు మేజిస్ట్రియల్ సెక్షన్ సూపరింటెండెంట్లు ఎస్.వి.ఎస్. నాయుడు, డి రాజేశ్వరి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 19న పాడేరులో మినీ మహానాడు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):** సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన తరువాత పండగ వాతావరణం లో ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న తొలి మహానాడు సభకు హాజరు అగుట కొరకు ఆయా నియోజక వర్గంలో మినీ మహానాడు జరుపుకొనుటకు పార్టీ ఆదేశించడం జరిగింది పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీన సోమవారం పాడేరు మండలం కుమ్మరిపుట్టు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ఇంటి ప్రాంగణంలో మినీ మహానాడు సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభకు పాడేరు నియోజకవర్గంలో ఉన్న రాష్ట్ర నాయకులు సీనియర్ నాయకులు, ఐదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు. క్లస్టర్ ఇంచార్జిలు యూనిట్ ఇన్చార్జులు. బూత్ కమిటీలు కేఎస్ఎస్లు పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు. పార్టీ ఐదు మండలాల జడ్పీటీసీలు ఎంపీపీలు ఎంపీటీసీలు సర్పంచులు మాజీ ఎంపీటీసీలు సర్పంచులు. టిడిపి అభిమానులు ఎన్టీఆర్ అభిమానులు, నియోజకవర్గస్థాయి మినీ మహానాడులో పాల్గొని పార్టీ నిర్మాణం, నియోజకవర్గ అభివృద్ధిపై అభిప్రాయాలు తెలియజేసి పాల్గొని మినీ మహానాడును జయప్రదం చేయాలని నియోజకవర్గం ఇంచార్జి గిడ్డి ఈశ్వరి కోరారు.

## మాతా, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి

- ప్రతి మరణానికి సంబంధించిన నివేదికను అందించాలి
- ప్రజల నమ్మకం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాసర్వే, మాతాశిశుమరణాలు, వ్యాది నిరోదకటీకాలు, మలేరియా, డెంగ్యూ తదితర అంశాలపై వెద్యాదికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ తదుపరి సమీక్షా సమావేశానికి ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు. నూతన దంపతులు, గర్భిణీ స్త్రీలు, శిశువుల రిజిస్ట్రేషను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. హైరిస్క్ కేసులు, బరువుతక్కువగల పిండాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, హైరిస్కు గల కేసులను ముందుగానే ఆసుపత్రులకు తరలించి మాతాశిశు మరణాలను కంట్రోల్ చేయాలని తెలిపారు. అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆసుపత్రులపై నిఘా పెట్టాలని, అబార్షన్లుకు గల కారణాలపై నివేదిక అందించాలని తెలిపారు. శిశువులకు వాక్సినేషను సకాలంలో అందించాలని సంబంధిత వివరాలను రికార్డులలో సక్రమంగా నమోదుచేయాలని తెలిపారు.గత సంవత్సరం 19781 జననాలకు గాను 133 మంది శిశువులు, మరియు 1 నుండి 5 సంవత్సరాల పిల్లలు 16 మంది మరణించారని, 15 మాతృమరణాలు సంభవించాయని, ఇకముందు మరణం సంబంవించిన ప్రతికేసుకు సంబంధించిన నివేదికలను కేసులువారీగా వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఆశ, ఎ.ఎన్.ఎం. వర్కర్లు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కువగా సిజేరియన్ నిర్వహిస్తున్న ఆసుపత్రుల వివరాలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ కేసుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, కేసులు నమోదెట్కన సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషను నిదులను ఆసుపత్రులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. 104 వాహనాల ద్వారా అందిస్తున్న సేవలన్నీ ప్రజలకు సక్రమంగా అందేలా వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి ఎం. శాంతిప్రభ, డిప్యూటీ డిఎంహెచ్ ఒ డా. వీరమణ, డిఐఒ డా. చంద్రశేఖర్ దేవ్, డి.పి.ఎం.ఒ. డా. ప్రశాంతి, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదాలు..!!

● విద్యుత్ స్తంబాలు, వైర్ల చుట్టూ అల్లుకున్న పిచ్చి మొక్కలు... ● పట్టించికోకుండా చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు ● లైన్ మాన్, లైన్ ఇన్స్పెక్టర్ ల పర్యవేక్షణ ఏది..? ● ఫ్యాన్ కింద కుర్చీలు లోనే డ్యూటీ చేస్తే గ్రామాల్లో సమస్యలు కు పరిష్కరం ఎలా.? ● భయాందోళనలో గ్రామ ప్రజలు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట, లోపూడి, పొట్టిదొరపాలెం గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పలు చోట్ల ట్రాన్స్ఫార్మర్తో పాటు స్తంభాలు, వైర్లను చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు చుట్టేశాయి. కరెంటు తీగలను అల్లుకున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయంతోపాటు గ్రామాల్లో పశువులు మేత కు వెళ్ళినప్పుడు వర్షాలు కు కరెంట్ స్తంబాలు కు అల్లుకున్న పొదలు నెలకు తాకడం తో విద్యుత్ సరఫరా జరిగి పశువులు, పశువులు కాపరులు మరణించిన సంఘటనలు కోకొల్లలు గా జరుగుతున్నప్పటకి విద్యుత్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీనితో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినవిధంగా వ్యహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు, గడ్డిజాతి మొక్కలు ఏపుగా పెరిగాయి. విద్యుత్ వైర్ల కింద ఉన్న మొక్కలు పెరిగి వైర్లను తాకుతున్నాయి. అదేవిధంగా గ్రామంలో రోడ్లపై ఉన్న కరెంటు స్తంభాల వద్ద మొక్కలు పెరిగి, వైర్లను అల్లుకున్నాయి. వర్షాలు కురిస్తే వర్షపు నీటికి కింద నుంచి పారిన చెట్ల తీగల నుంచి కరెంటు సరఫరా అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని విద్యుత్ అధికారులే చెబుతుంటారు. వాన పడితే విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని అధికారులు సలహాలు ఇస్తుంటారు. కానీ ప్రమాదాలు నివారించడానికి చర్యలు మాత్రం చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను, అల్లుకున్న తీగలను తొలగించాలని, ట్రాన్స్ ఫార్మర్ వద్ద శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రీ సర్వే చేసి కాలువల్లో సాగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలి

### - ఇరిగేషన్ అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు పాలకవర్గం సభ్యులు, జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ అధికారులు తో కలిసి శుక్రవారం గుండాల జంక్షన్ వద్ద ఉన్న శంకరం సమావేశ మందిరంలో సమావేశం జరిగింది.సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ నీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్, డైరెక్టర్లు రైతులతో కలిసి ఈ నిధులను పనులు ప్రారంభించాలని అన్నారు.

మన ప్రాంతంలో ఉన్న ఇరిగేషన్ కాలువలకు, గ్రోయిన్స్ కు నిధులు కేటాయించకపోవడం నిర్లక్ష్యం వహించడం వలన మన ప్రాంతంలో రైతులకు ఎంతో అవసరమైన కాలువలు పుడికిపోయి అక్రమలకు గురయ్యాయని ఇప్పుడు వాటిని రీ సర్వే చేసి కాలువలో సాగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనకాపల్లి మండలం, కశింకోట మండలం ల లో వున్నా ఓఎం పనులు కింద డిసిల్టింగుకి.. నీటి సంఘాల ద్వారా కాలువలు చెరువులు అభివృద్ధికి నిధులు.. కసింకోట కాశీ మధుం ఛానల్ కి తొమ్మిది లక్షలు, పేరంటాలపాలెం ఛానల్ కి ఆరు లక్షలు, సీతానగరం ఛానల్ కి 10 లక్షలు, తగరంపూడి ఛానల్ కి 10 లక్షలు, వెదురుపర్తి ఛానల్ కు ఆరు లక్షలు, తుమ్మపాల ఛానల్ కి 10 లక్షలు, మాకవరం ఎర్రి నాయుడు ఛానల్ కి 10 లక్షలు, సంతపాలెం వీరన్న ట్యాంకుకు 10 లక్షలు, సిహెచ్ఎన్ అగ్రహారం ధర్మసాగరం ట్యాంకుకు 10 లక్షలు, బట్లపూడి ఎరకన్న దొర ట్యాంక్ కు 10 లక్షలు, రేబాక వూర ట్యాంకుకి తొమ్మిది లక్షలు,మొత్తం కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయని అన్నారు. అదేవిధంగా అనకాపల్లి పట్నం జీవీఎంసీ పరిధిలో ఉన్న 11 మురుగు నీరు కాలవులలో డి సిల్టింగ్ చేయటనికి 50, 25, 000 రూపాయలు నిధులు మంజూరు అయ్యయని అన్నారు. అదేవిధంగా పులి కాలవ 28లక్షలు, వెదుళ్ల గడ్డ సిహెచ్ఎన్ అగ్రహారం 29లక్షల ముప్పది వేలు, పొతుకొండ గెడ్డ కొండుపాలెం గ్రామంకు 18లక్షల 20 వేలు,కొప్పాక గ్రామం గైరమ్మ గెడ్డకి 6లక్షలు, దిబ్బపాలెం గ్రామం చెర్లోపల ఛానల్ కు 9.95లక్షలు, అనకాపల్లి టౌన్ చెర్లోపల ఛానల్ కు 9.90లక్షలు, తుమ్మపాల గ్రామమం ఎల్లయ్య ఛానల్ కు 9.95 లక్షలు, అనకాపల్లి టౌన్ ఎల్లయ్య ఛానల్ కు 10లక్షలు, మొత్తం కోటి ముప్పై ఏడు లక్షలు నిధులు మంజూరు అయ్యాయి అనీ అన్నారు.తక్షణమే వీటికి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ పరిధిలో చేపట్టిన పనులు ఈ నెల ఆఖరు లోపల పనులు పూర్తి చేయాలని అన్నారు%ఎ% అదే విదంగా జిల్లా కలెక్టర్ ని ఆవకాండం, నీటిపారుదల కాలువలు లో అక్రమణాలను తొలగించాలని కలెక్టర్ కి చెప్పడం అయిందని అన్నారు. కాలవలు పూర్తిగా రి సర్వే చేయాలని అధికారులు ఆదేశించారు,కాలువలు నీటి వనరులు అక్రమనలకు గురైతే రాబోయే రోజుల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటామని అన్నారు.


## 19 నుండి పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 46 పరీక్షా కేంద్రాలలో 7,837 మంది పరీక్షలకు హాజరు
- జూన్ పది వరకు ఐదారు తరగతుల విద్యార్థులకు వేసవి శిక్షణ శిభిరాలు
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



**పాడేరు/జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 19 నుండి 28 వరకు పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ జరుగుతాయని, పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్ లో వేసవి సెలవులలో ఐదారు తరగతుల విద్యార్థుల కోసం కమాల్ క్యాంపులు పేరిట ప్రధమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిభిరాలు నిర్వహిస్తున్నట్లు, వాటిని ఐదారు తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 7837 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని వారి కోసం 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చెయడం జరిగిందని తెలిపారు. పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల ఫరిధిలో 163 (2) బి ఎన్ ఎస్ ఎస్-2023 సెక్షన్స్ అమలుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు.ఈ సెక్షన్ ప్రకారం పరీక్షా కేంద్రానికి 200 మీటర్ దూరం లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుడికుడా ఉండరాదు, కర్రలు, పేలుడు వస్తువులు లేదా ఇతర ఆయుధాలు మరియు రాళ్ళు తీసుకుని వెల్లడం నిషేద%శీ% అని కలెక్టర్ వివరించారు.

## యు జె ఎఫ్ కరదీపిక ఆవిష్కరణ




**జి.మాడుగుల/పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల జర్నలిస్టుల ఫోన్ నెంబర్లతో కూడిన హ్యాండ్ బుక్ ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో దినేష్ కుమార్ యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ను ఆవిష్కరించారు. యూజేఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఏపియుడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే.రాము మాట్లాడుతూ యూజేఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్.ఎం.ఆర్.ఎన్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. పార్లమెంటు సభ్యులు డా.గుమ్మా తనూజ రాణి యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ గోవిందరాజులు , యుజెఎఫ్ కోఆర్డినేటర్ హరనాథ్, అల్లూరి జిల్లా ప్రతినిధి సూర్యారావు, చింతపల్లి ప్రతినిధులు ఆనందరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




**అచ్యుతాపురం, (విశాఖ సమాచారమ్):-** ఎస్సీ జెడ్ పరిశ్రమల కార్మికులు 20వ తేదీన జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఈరోజు అచ్యుతాపురం ఎస్సీ జెడ్ కార్మికులతో సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము మాట్లాడుతూ యుద్ధం వాతావరణం కారణంగా ఈనెల 20వ తేదీన జరిగే సమ్మె వాయిదా వేసి జూన్ 9వ తేదీన సమ్మె చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి, దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తీసుకొచ్చింది వీటిని రద్దు చేయాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటుగా ఆపాలని స్కీం లో పనిచేసే కార్మికులను గుర్తించాలని ,ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రభాకర్, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన నీటి సరఫరాయే జల్ జీవన్ మిషన్ లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



**జి.మాడుగుల/పాడేరు, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఇంటి ఇంటికి కొళాయి (హర్ఘర్ జల్) పథకం కింద కుటుంబానికి సరిపడా 55 ఎల్ పి సి డి నాన్యవంతమైన నీటిని సరఫరా చేయడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో శత శాతం ఇంటింటి కొలాయిలు ఏర్పాటు చేయాలని, 4970 గ్రామాలకు గాను, 1340 గ్రామాలలో శతశాతం సాధించడం జరిగినందున వెంటనే ఆయా గ్రామాలను హర్ ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 2.40 లక్షల గృహాలకు గాను 1.22 లక్షల గృహాలకు పథకం అందించడం జరిగిందని, మిగిలిన 1.18 లక్షల గృహాలకు పథకం అందించడానికి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పనులు నిర్ణీత కాలంలో పూర్తీ చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టు లో చేర్చాలన్నారు. ఇప్పటికే డిక్లేర్ చేసిన గ్రామాల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుని లోపాలుంటే సరి చేయాలని సూచించారు.అదేవిధంగా మలమూత్ర రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది వాటిని కూడా మలమూత్ర రహిత గ్రామాలుగా ప్రకటించాలన్నారు. అందుకు అవరసమైన తీర్మానాలను గ్రామ సభల ద్వారా ప్రకటించాలన్నారు. జల్జీవన్ మిషన్ కింద సుమారు రూ. 626 కోట్లు మంజూరు కాగా రూ.144 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ప్రతి ఇంజినీరింగ్ అధికారికి టార్గెట్ నిర్ణయించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల విషయంలో పెదబయలు, ము0చింగి పుట్టు మండలాలలో వెనుకబడి ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో ఇంకా సుమారు 17 శాతం కేంద్రాలకు రనింగ్ వాటర్ టాయిలెట్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉనందున వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు వారి వారి ఫరిధిలో గల గ్రామ నీరు మరియు పారిశుధ్య కమిటీలను చైతన్య పరచాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి జలజీవన్ మిషన్ పనులలో లోటుపాట్లను సరిచేయించ వలసిందిగా కోరారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటిసరఫరా ఇంజినీరింగ్ అధికారి కె. జవహర్ కుమార్, కమిటీ సభ్యులు జిల్లా విద్యా శాఖాధికారి పి. బ్రహ్మాజీ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ బాషా, ఐసిడిఎస్ ఇంచార్జ్ పిడి ఎస్తేరు, జిల్లా వ్యవసాయాదికారి ఎస్బిఎస్ నంద్, డిఆర్డిఎ ఎపిడి లాలం సీతయ్య, డిపిఆర్ఓ పి. గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు




**గొలుగొండ, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో శనివారం స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర (బీట్ ద హీట్) కార్యక్రమంలో భాగంగా వేసవి తీవ్రతను తగ్గించుటలో భాగముగా గ్రామములో గల రామకోవెల దగ్గర గ్రామ సర్పంచ్ శ్రీమతి లోచల సుజాత మరియు కార్యదర్శి ఇంచార్జి (ఇ ఓ పి ఆర్ డి) కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాద్, గ్రామ పంచాయతీ గుమస్తా హేమంత్, అంగన్వాడి సిబ్బంది, పారిశుధ్ధ్య కార్మికులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇదే మా సెల్యూట్ - తిరంగా ర్యాలీ




**అరకు లోయ, (విశాఖ సమాచారమ్):-** పాకిస్తాన్ ఉగ్ర మూకలు చేసిన దాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ జరిపిన దాడి సరైన సమాధానమని, మన సైన్యం చూపిన ధైర్యసహసాలకు ఇదే మా సెల్యూట్ అని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపిఎస్ఆర్టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర గారు పేర్కొన్నారు. అరకు పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు శనివారం దొన్ను దొర ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలి నిర్వహించారు. సెక్యూరిటీ ఫర్ నేషనల్ సెక్యూరిటీ పేరుతో ఆపరేషన్ సింధూర్ కి మద్దతుగా ఈ ర్యాలీని నిర్వహించారు. భారత సైన్యానికి మద్దతు తెలుపుతూ ఖబర్దార్ పాకిస్తాన్.... జయహో భారత్ అంటూ నినదించారు. సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ పాకిస్తాన్ చేసిన ఉగ్రదాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధుతో భారత్ ఇచ్చిన సమాధానం ప్రతి భారతీయుడికి గర్వంగా ఉందన్నారు. భారతీయ మహిళల నుదుట తిలకం చెరిపేసిన పాకిస్తాన్ ఉగ్ర మూకల స్థావరాలను కొన్ని నిమిషాల వ్యవధిలోనే భారత సైన్యం నేలమట్టం చేయడం ఈ ప్రపంచం యావత్తు చూసిందన్నారు. భారత సైన్యం చూపిన ధైర్య సాహసలతో భారత సత్తా ఏంటో ఈ ప్రపంచానికి తెలిసిందన్నారు. అనేకమంది వీరులు ఈ యుద్ధంలో అమరులయ్యారని అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. అమరులైన వీరుల కుటుంబాలకు అంతా అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను అమాయక పర్యాటకులపై దాడి జరిపిన ఉగ్రవాదులను అప్పగించే వరకు ఆపరేషన్ సింధూర్ కొనసాగుతూనే ఉందని గౌరవ ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోడీ గారు భారత జాతికి నింపిన ధైర్యం స్ఫూర్తిదాయకమన్నారు. సైన్యానికి, గౌరవ ప్రధానమంత్రి వర్యులు నరేంద్ర మోడీ గారికి ఆంధ్రప్రదేశ్ తరఫున గౌరవ ముఖ్యమంత్రివర్యులు లిశ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ యావత్ ప్రధానికి, భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అరకు నియోజకవర్గ ఇన్చార్జి చిరంజీవి, అరకు వ్యాలీ తెలుగుదేశం పార్టీ మండలాల అధ్యక్షులు శెట్టి బాబురావు, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, మాదల పంచాయతీ సర్పంచ్ వంతల శ్రీనివాసరావు, టిడిపి మహిళ నాయకులు బూర్జ లక్ష్మి, బోరి బోరి లక్ష్మి, మాడగడ మాజీ ఎంపీటీసీ నీరజాకుమారి , ద్రౌపది, చిన్ని, మాదల వార్డ్ మెంబర్ గంగ, పెదలబుడు వార్డ్ మెంబర్ కిల్లో నాగరాజు, సోమేలి వనాది, మాజీ సర్పంచు లొకోయ్ మాధవ్, జనసేన నాయకులు సమర్ధి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిలో మొక్కలు పెంచాలి

- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి (సబ్బవరం), (విశాఖ సమాచారమ్ బ్యూరో):** ఇళ్లు, పరిసర ప్రాంతాలలో మొక్కలు పెంచుట ద్వారా వాతావరణ ఉష్ణోగ్రతలు తగ్గించుటకు కృషిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలలో బీట్ ది హీట్ నినాదంతో నిర్వహించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సబ్బవరం మండలం బాటజంగాలపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పాల్గొన్నారు.

ముందుగా గ్రామంలో ప్రయాణికులు, బాటసారుల కొరకు ఏర్పాటు చేసిన వేసవి షెల్టరు కేంద్రాన్ని జిల్లా కలెక్టరు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు వడదెబ్బ తగులకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తూ ఏర్పాటుచేసిన వైద్యశిబిరం పరిశీలించారు. ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమం గూర్చి, వైద్య సేవలు గూర్చి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మాతృమరణాలు ఎక్కువగా ఉన్నాయని, హైరిస్కు గల కేసులను నిత్యం పర్యవేక్షించాలని, మాతాశిశు మరణాలు సంబవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పశువుల దాహార్తిని తీర్చుటకు ఏర్పాటుచెసిన నీటికుండీని ప్రారంబించారు. నీటికుండీలో నిత్యం నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేసారు. కేంద్రానికి ప్రహారీ నిర్మించాలని, కేంద్రంలో తయారైన ఎరువులను విక్రయించుటకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను నిల్వచేసే చెత్తకుంటను ప్రారంభించి సక్రమంగా వినియోగించుకోవలసినదిగా గ్రామస్తులకు తెలియజేసారు. కార్యక్రమంలో భాగంగా కేన్సర్ టెస్టింగు సెంటరులో మొక్కలు నాటారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. బౌగోళిక మార్పుల కారణంగా వాతావరణంలో విపరీతంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణం కాపాడుకొనుటకు తీసుకోవలసిన చర్యలు గూర్చి ప్రజలలో చర్చ జరగాన్నారు. ఎండలో బయట తిరగకూడదని, ఎండనుండి రక్షణకు గొడుగు లేదా టోపీ వాడాలని, నీరు ఎక్కువగా త్రాగాలని తెలిపారు. వైద్య సిబ్బంది అందించే సూచనలు, సలహాలు పాంటించాలన్నారు. ఎవరికైనా వడదెబ్బ తగిలితే వెంటనే వెద్యం అందించాలని సూచించారు. ముందు జాగ్రత్తలు తీసుకొనుట ద్వారా వడదెబ్బ మరణాలను నివారించవచ్చని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకొనుటకు, ఉష్ణోగ్రతలు తగ్గించుటకు ప్రతి ఒక్కరు వారివంతు సహకారం అందించాలని తెలిపారు. గ్రామస్తులు చెత్తను కాలువలు, రోడ్డుపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందించాలని, సంపద సృష్టి కేంద్రాలలో వాటిని ఎరువులుగా మార్చి వినియోగించాలని తెలిపారు. వాతావరణ సమతుల్యానికి, ఉష్ణోగ్రతలు తగ్గుటకు మొక్కలు విరివిగా నాటాలని, ప్రతి ఇంటిలో కనీసం పది మొక్కలు పెంచుకోవాలని అన్నారు. పక్షులకు కూడా దాహార్తిని తీర్చేలా నీటిని అందుబాటులో ఉండేలా కుండీలలో నీరు ఏర్పాటుచేయాలని విద్యార్థులకు సూచించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఒ. కె.రాజుకుమార్, మండల పత్యేక అధికారి కె.రమామణి, జిల్లా పంచాయతీ అదికారి ఆర్. శిరీషారాణి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ. నాగలక్ష్మి, తహశీల్దారు బి.చిన్నికృష్ణ, మండల అభివృద్ది అధికారి పి. పద్మజ, మెడికల్ అధికారి డా. సిహెచ్. ఆశ, ఎన్ అర్ ఇ జి ఎస్ ఎపిడి జె.మణికుమార్, సర్పంచ్ పడాల వెంకటరమణ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వనం సత్యనారాయణ, ఇతర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# కడపలో ఏపీజేయు జిల్లా అడహక్ కమిటీ సమావేశం



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఫర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ఆల్ ఇండియా న్యూస్ పేపర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (న్యూఢిల్లీ) అఫిలియేటెడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు కడపలో జిల్లా అడ్హాక్ కమిటీ సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ సమావేశంలో ఏపీజేయూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాలే వాసుదేవ నాయుడు, కడప జిల్లా పూర్వ అధ్యక్షుడు, ప్రస్తుత అడ్హాక్ కమిటీ కన్వీనర్ అల్లం రంగనాయకులు, యూనియన్ నాయకులు జె. భరత్ కృష్ణ, ఏ. భాస్కర్, కె. పృథ్వి, టి. పవన్ తదితర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మీడియా అక్రిడిటేషన్ 2025 నిబంధనల రూపకల్పన కోసం హౌసింగ్ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, టూరిజం, సినిమా, ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఫైనాన్స్, ప్లానింగ్, లెజిస్లేటివ్ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లతో త్రిసభ్య మంత్రి కమిటీని నియమించిన నేపథ్యంలో, ఈ నిర్ణయాన్ని ఏపీజేయూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాలే వాసుదేవ నాయుడు, ప్రధాన కార్యదర్శి చలాది పూర్ణచంద్రరావు హర్షంగా స్వాగతించారు.

మీడియా అక్రిడిటేషన్ జి.ఓ రూపకల్పన సమయంలో జర్నలిజం విలువలు పరిరక్షించేందుకు అవసరమైన నిబంధనలను రూపొందించాలని, నూతనంగా వస్తున్న మీడియా వేదికల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, పాత జి.ఓలను రిఫరెన్స్‌గా కాకుండా, ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త జి.ఓను రూపొందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పనిచేస్తున్న అర్హత కలిగిన విలేకర్లందరికీ అక్రిడిటేషన్లు జారీ చేసేలా స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలని హితవు పలికారు.

ఈ సమావేశంలో కడప, అన్నమయ్య జిల్లాల్లో నెల రోజుల వ్యవధిలో పూర్తిస్థాయి జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వాసుదేవ నాయుడు గారు, అడ్హాక్ కమిటీ కన్వీనర్ అల్లం రంగనాయకులు గారిని ప్రత్యేకంగా ఆదేశించారు.

ఈ సందర్భంలో రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ నాయుడు గారు, రాష్ట్ర కార్యదర్శి పూర్ణచంద్రరావు గారు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో ప్రకటించారు.

అలాగే, రాష్ట్ర కార్యాలయం ప్రస్తుతం అమరావతి తాడేపల్లిలో కొనసాగుతూ ఉండగా, ఈ నెల 23వ తేదీన విజయవాడ సత్యనారాయణపురంలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. అదే విధంగా, ఉమ్మడి రాష్ట్రంలో రెండవ యూనియన్‌గా గుర్తింపు పొందిన ఏపీజేయూ తన 35వ వార్షికోత్సవాన్ని ఇటీవల కూచిపూడిలో ఘనంగా నిర్వహించిందని, త్వరలో తిరుపతిలో ప్రాంతీయ సభ, అనంతరం అరకులో 35వ మహాసభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

# "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమంలో శ్రమదానం

## పరిశుభ్రతకు నాంది పలికిన బోయిల కింతాడ గ్రామ ప్రజలు




**దేవరపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత ఎంతగానో అవసరం అనే దృక్పథంతో,బోయిల కింతాడ గ్రామ పంచాయతీ "స్వచ్ఛ ఆంధ్ర %-% స్వచ్ఛ దివస్" సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని దేవరాపల్లి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ బూరె బాబురావు,గ్రామ పంచాయతీ పాలకవర్గం,గ్రామ సచివాలయం సిబ్బంది విశేషంగా నిర్వహించింది.గ్రామ సచివాలయం పరిధిలో, కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది,ఆరోగ్య శాఖ సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ ప్రాంగణం,రికార్డు గదులు మొదలైన ప్రాంతాలను శుభ్రపరిచారు.చెత్తను తొల గించి, మొక్కల చుట్టూ ఉన్న కలుపును తొలగించి,ఆరోగ్య శాఖ నుండి వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేసి అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం లో మజ్జి పంపిణి చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బూరె బాబురావు గారు మాట్లాడుతూ "స్వచ్ఛతే ఆరోగ్యానికి పునాది.ప్రతి ఒక్కరికి పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించటం ప్రజలు బాధ్యత గా తీసుకోవాలన్నారు."ప్రతి ఒక్కరు తమ నివాస ప్రాంతాలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా చెత్త నిర్వహణ కోసం ప్రత్యేక డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయడం,ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే సూచనలు,మొక్కలు నాటడం వంటి పలు చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, వార్డు సభ్యులు అన్నం వెంకటరావు, గ్రామ పెద్దలు గోరపల్లి కృష్టారావు, వియ్యపు అప్పారావు, తలారి చిన బాబు, సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్ కార్మికులు,ప్రజలు తదితరులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఈ నెల 19వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి అడ్వాన్సడ్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులకు యిబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం మద్యాహ్నం జిల్లా కలెక్టరు వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖలు చేపట్టవలసిన చర్యలు గుర్చి తెలియజేసారు. బందోబస్తు, పరీక్షా కేంద్రాలలో శానిటేషను, మంచినీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయాలని, పరీక్షా జవాబు పత్రాలను పంపించుటకు పోస్టలు సిబ్బంది సహకరించాలని, పరీక్షల సమయంలో కరెంటు కోతలు ఉండకూడదని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా బస్సులు ఏర్పాటుచేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు గంటముందుగానే చేరుకొనేవిధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. రవాణా కారణంగా ఏ ఒక్కవిద్యార్థి పరీక్షరాయలేని పరిస్థితి ఉండకూడదని తెలిపారు.జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు పరీక్షల వివరాలు తెలియజేస్తూ ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు 2481 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1268 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. వారికి జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.వీటితో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 357 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 994 మంది పరీక్షతప్పిన విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 19 నుంచి 24వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణ సంబంధిత రెవిన్యూ, పోలీసు, ఆర్.టి.సి., ట్రైజరీ, పోస్టలు, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# "సిరివెన్నెల సీతారామశాస్త్రి 70వ జయంతి పోస్టర్ ఆవిష్కరణ"



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** పట్టణంల జనసేన కార్యాలయంలో, మాజీ మాజీ మంత్రులు, స్థానిక శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి 70 జయంతి పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20 మంగళవారం అనకాపల్లి పట్టణంలో ఉన్న సత్యా గ్రాండ్ లో సాయంకాలం 5 గంటలకు సీతారాం శాస్త్రి 70 జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, పీల నాగ శ్రీను, (నూకాంబిక దేవస్థానం చైర్మన్), గంటి రవి కుమార్(అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం ప్రెసిడెంట్),కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పరిహారం చెల్లింపులకు సత్వర చర్యలు

## జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్



**జి.మాడుగుల/పాడేరు, (విశాఖ సమాచారమ్):-** జాతీయ రహదారికి భూములు కేటాయించిన వారికి పెండింగ్ పరిహారం చెల్లింపులకు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ, టూరిజం, జాతీయ రహదారి అధారిటీ అధికారులతో జాతీయ రహదారి నిర్మాణం, పరిహారం చెల్లింపులుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న రహదారులు, తాగునీటి పథకాలు, నీటి పారుదల వనరుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పరిహారం చెల్లింపులలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులు చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యతా పరంగా చెల్లింపులు చేయాలని స్పష్టం చేసారు. పాడేరు లగిశపల్లి, పాడేరు కొయ్యూరు జాతీయ రహదారి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జాతీయ రహదారి అధికారులు గుల్షన్ కుమార్, రవి శేఖర్, తాహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# కొమర్రాజు లక్ష్మణరావు

## నేడు జయంతి



కొమర్రాజు లక్ష్మణరావు 1876 మే 18 న కృష్ణా జిల్లాలోని నందిగామ తాలూకాలోని పెనుగంచిప్రోలు అనే గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి వెంకటప్పయ్య తల్లి గంగమ్మ. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని భువనగిరిలో పూర్తి చేసిన తరువాత నాగపూర్ లో బి.ఏ పట్టబద్రులయ్యారు. లక్ష్మణరావు గారికి 3 సంవత్సరాల వయస్సులో తండ్రి చనిపోయారు. తల్లితో కలిసి లక్ష్మణరావు నాగపూర్ లో ఉన్న మేనమామ ఇంటికి వెళ్లారు. ఆయన కళాశాల చదువు అక్కడే పూర్తిచేశారు. 1901 లో హైదరాబాద్ లో వెలిసిన శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం సంస్థాపకుల్లో కొమర్రాజు లక్ష్మణరావు ప్రధాన పాత్రధారి. దేశంలో లభ్యమయ్యే ఆధునిక గ్రంధాలు అనేకం అక్కడి గ్రంథాలయంలో లభ్యమయ్యేలా చేసాడు.అనంతరం ఆయన తన మిత్రుల సహాయంతో ఆయన చిరకాల కోరిక అయిన ' విజ్ఞాన సర్వస్వం'అనే ప్రోజెక్టును ప్రారంభించారు.తరువాత ఆయన 1906 లో ' విజ్ఞాన చంద్రిక మండలి ' అనే సంస్థ స్థాపించాడు. మరాఠీ భాషలో అనేక వ్యాసాలు , పద్యాలు రాశారు. మౌరోపంత్ అనే మరాఠీ కవి రచించిన కర్ణ పర్వానికి లక్ష్మణరావు పరిష్కర్త. దీనివల్ల ఆయనకున్న మరాఠీ భాషా పాండిత్యం ఎంతటి లోతైనదో తెలుస్తుంది. మహారాష్ట్ర దేశంపై ఆయనకున్న మమకారం,అభిమానం ఆయన చే మహారాష్ట్ర విజృంభనము అనే కావ్యాన్ని రాయించింది. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కు శ్రీకారం చుట్టిన మహానీయుడితడే. వారు నాటిన విత్తు నేటికి మహా వృక్షమైనదని , వీరి వేషధారణలో , విద్యాధికత వ్యక్తమయ్యేదని ,ఆకారం మధునా పంతుల ఆంధ్ర రచయితలు అనే గ్రంథంలో వీరి సేవానిరతిని ఆకృతిని పొగిడినారు.లక్ష్మణరావు కు కావ్యాకళా దృష్టి , కావ్యరసాస్వాధన శక్తి కూడా ఉంది.కానీ కావ్యాల వల్లనే వాగ్మయానికి శాసతత్వం కలగదని ఆయన గట్టి నమ్మకం అందువల్ల చరిత్ర ,శాసనాల పరిశోధనకు , శాస్త్ర గ్రంధాల రచనకు , వాటి ప్రకటనకు జీవితమంతా అంకితం చేశారు.కొమర్రాజు లక్ష్మణరావు 1923 జూలై 12 న పరమపదించారు.

డా.జె.వి.ప్రమోద్ కుమార్
పైడిమెట్ట 9490833108.

# క్రీడా సమాచారమ్

## నీరజ్ చోప్రాకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు



**ఇంటర్నెట్ డెస్క్:** భారత్ జావెలిన్‌త్రో హీరో నీరజ్‌చోప్రా తన కెరీర్లో తొలిసారిగా 90 మీటర్ల మార్కును అందుకున్నాడు. శుక్రవారం దోహా డైమండ్ లీగ్ జావెలిన్ త్రో పోటీల్లో నీరజ్.. బల్లెన్ని 90.23 మీటర్ల దూరం విసిరి తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరుచుకున్నాడు. అయితే అతడు రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జర్మనీ క్రీడాకారుడు జులియన్ వెబర్ తన చివరి ప్రయత్నంలో 91.06 మీటర్ల ప్రదర్శన చేయడమే దీనికి కారణం.

నీరజ్ గత ఉత్తమ ప్రదర్శన 89.94 మీటర్లు. 2020 ఒలింపిక్స్‌లో 87.58 మీటర్ల ప్రదర్శనతో స్వర్ణం గెలిచి సంచలనం సృష్టించాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 87.58 మీటర్లతో రజతం నెగ్గాడు. 2023లో 88.17 మీటర్ల ప్రదర్శనతో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో విజేతగా నిలిచాడు. తాజాగా దోహా డైమండ్ లీగ్‌లో విజేతగా నిలవకపోయినా 90 మీటర్ల మార్కును అందుకోవడంతో నీరజ్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ సైతం నీరజ్‌ను అభినందించారు.

'అద్భుతమైన ఫీట్! దోహా డైమండ్ లీగ్ 2025లో 90 మీటర్ల మార్కును అధిగమించి తన వ్యక్తిగత అత్యుత్తమ త్రోను సాధించినందుకు నీరజ్ చోప్రాకు అభినందనలు. ఇది అతని అవిశ్రాంత అంకితభావం, క్రమశిక్షణ ఫలితం. ఈ ప్రదర్శనతో భారతదేశం గర్విస్తోంది' అని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా నీరజ్‌ను ప్రశంసిస్తూ పోస్ట్ చేశారు.

## శ్రేయస్ తన జట్టు సభ్యుల్లో గెలవాలన్న కోరికను రగిలిస్తాడు




– సురేశ్ రైనా

ఇంటర్నెట్ డెస్క్: పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ జట్టును చక్కగా ముందుకు నడిపిస్తున్నాడని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అంటున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన శ్రేయస్.. ఈసారి పంజాబ్‌కు సారథ్య బాధ్యతలు వహిస్తున్నాడు. ఐపీఎల్ మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ ఫ్రాంఛైజీ ఏకంగా 26.75 కోట్లు వెచ్చించి శ్రేయస్‌ను సొంతం చేసుకుంది. దీనికి న్యాయం చేస్తూ.. ఇప్పటివరకు తాను ఆడిన 11 మ్యాచుల్లో 50.63 సగటుతో 405 పరుగులు చేశాడు పంజాబ్ సారథి. ఇందులో నాలుగు అర్ధసెంచరీలు ఉన్నాయి.

'శ్రేయస్ అయ్యర్.. డ్రెస్సింగ్ రూంలో చక్కటి వాతావరణం ఉండేలా చూస్తున్నాడు. జట్టు సభ్యుల్లో సానుకూలతను, గెలవాలన్న కోరికను రగిలిస్తున్నాడు. కోచ్‌గా రికీపాంటింగ్ కూడా చక్కటి సేవలు అందిస్తున్నాడు. పంజాబ్ జట్టుకు ప్రభుసిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య చక్కటి ఆరంభాన్ని ఇస్తున్నారు. తర్వాత దాన్ని శ్రేయస్ అయ్యర్ కొనసాగిస్తున్నాడు.' అని రైనా అన్నాడు.

అలాగే పంజాబ్ కింగ్స్ జట్టును వెంటాడుతున్న దురదృష్టాన్ని గురించి కూడా సురేశ్ రైనా మాట్లాడాడు. 'ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 200 పైచిలుకు పరుగులు చేసింది. కానీ వర్షం వల్ల ఆ మ్యాచ్ రద్దైంది. అలాగే ధర్మశాలలో 10.1 ఓవర్లకు ఒక వికెట్ నష్టానికి 124 పరుగులు చేసి పటిష్ఠ స్థితిలో ఉంది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ దశలో ఆ మ్యాచ్ కూడా అర్ధంతరంగా రద్దైంది. ఇలా ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు కాస్త అదృష్టం కలిసిరావడం లేదని' రైనా తన అభిప్రాయం వ్యక్తంచేశాడు.

## హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్‌ను కలుసుకున్న 'పెరుసు' హీరోయిన్



ప్రముఖ హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్‌ను యూట్యూబర్, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక కలుసుకుంది. టామ్ క్రూజ్ నటించిన తాజా చిత్రం "మిషన్: ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకానింగ్"రల్డ్ ప్రీమియర్ షో లండన్‌లో ఇటీవల జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన నిహారిక, టామ్ క్రూజ్‌తో కలిసి ముచ్చటించడంతో పాటు అతడితో కలిసి ఫొటోలు దిగింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఈ విషయాన్ని నిహారిక తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. టామ్ క్రూజ్‌తో ఉన్న వీడియోను షేర్ చేస్తూ ఆమె భావోద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేశారు. "ఈ మిషన్ సాధ్యమవ్వడంతో నా ఆత్మ పరవశించిపోయింది. దీని నుంచి తేరుకోవడానికి నాకు ఒక శతాబ్దం పడుతుంది. టామ్ క్రూజ్ సర్ మీరు ఎంతో గొప్ప వ్యక్తి నేను కలలో కూడా ఊహించని ఈ కల నిజమయ్యేలా చేసినందుకు ధన్యవాదాలంటూ ఆమె రాసుకోచ్చారు. కాగా, "మిషన్: ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకానింగ్" చిత్రం నేడు వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మిషన్: ఇంపాజిబుల్ సిరీస్‌లో వస్తున్న చివరి చిత్రమిది. ఇప్పటివరకు ఈ సిరీస్‌లో 8 చిత్రాలు వచ్చాయి.

సోషల్ మీడియాలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిహారిక ఇప్పుడు నటిగానూ రాణిస్తున్నారు. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఎంతో మంది ఫాలోవర్స్‌ను సంపాదించుకున్న ఆమె, ఇటీవలే విడుదలైన 'పెరుసు' చిత్రంలో నటించి ప్రేక్షకుల మెప్పు పొందారు. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభిస్తోంది.

## నిధి అన్వేషకుడు

తన కొత్త సినిమాలో కథానాయకుడు నాగచైతన్య ట్రెజర్ హంటర్ పాత్రలో సందడి చేయనున్నారు. ఆ పాత్ర పేరు అర్జున్. నిధి అన్వేషణలో అర్జున్ చేసిన సాహసాలు ఎలాంటివన్నది తెరపైనే చూడాలి. 'విరూపాక్ష'తో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న కార్తీక్ దండు దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ కలిసి రూపొందిస్తున్నాయి. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, సుకుమార్ నిర్మాతలు. బాపినీడు సమర్పకులు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. నాయకానాయికలపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు.

**భారీస్థాయిలో గుహ సెట్ నిర్మాణం**

ఈ సినిమా కోసం అత్యంత సహజమైన ఓ భారీ గుహ సెట్‌ని తీర్చిదిద్దారు. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీనాగేంద్ర తంగల నేతృత్వంలో రూపొందించిన ఈ గుహలోనే 18 రోజులుగా చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం ఈ సెట్‌లోనే చిత్రబృందం మీడియా ప్రతినిధులతో సమావేశమైంది. ఈ గుహ నేపథ్యంలో వచ్చే 20 నిమిషాల సన్నివేశాలు సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని దర్శకుడు తెలిపారు. "గుహ నేపథ్యంలో సన్నివేశాల్ని విజువల్ ఎఫెక్ట్స్‌తో చేసేందుకు ఆస్కారం ఉంది. కానీ నిజంగా ఆ గుహలో ఉంటూ చిత్రీకరణ చేస్తే కలిగే అనుభూతి వేరు" అన్నారు దర్శకుడు. "హీరో ట్రెజర్ హంటర్ పాత్రలో కనిపిస్తారు. అలాగని ఇది నిధి అన్వేషణ చుట్టూ సాగే కథ కాదు. వర్తమాన అంశాలతో ముడిపడిన కథ ఇది. ప్రేక్షకులు ఓ కొత్త అనుభూతికి గురయ్యేలా కథ, కథనాలు ఉంటాయ"ని అన్నారు.

## ఘనంగా సుందరీమణుల స్పోర్ట్స్ ఫైనల్స్





**హైదరాబాద్, (విశాఖ సమాచారమ్):–** ప్రపంచ సుందరి పోటీల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ ఫైనల్స్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వరల్డ్ ఫౌండర్ జూలియా మోర్లీ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ఎంపీ, బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాల, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం హనుమంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**హాజరైన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు**

క్రీడాకారులు తాంగ్ –త మార్షల్ ఆర్ట్స్ , రోలర్ స్కేటింగ్ ప్రదర్శన చేశారు.

మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ యోగాసనాలు చేశారు. అనంతరం బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు.

## స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం- "బీట్ ది హీట్"పై అవగాహన




**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):–** నర్సీపట్నం మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దినోత్సవ కార్యక్రమం ప్రతి నెల మూడో శనివారం నాడు నిర్వహిస్తున్నారు. ఈ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి, 26వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి చింతకాయల పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ పై కౌన్సిలర్ పద్మావతి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అక్కడ నుండి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై "బీట్ ది హీట్" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, వేసవి కాలంలో దాహార్తికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు మజ్జిగ, నీరు, నిమ్మరసం వంటి పానీయాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎండలో ప్రయాణాలు తగ్గించి, తలపై తడి గుడ్డలు ఉంచుకోవాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో ఆరోగ్యపరమైన జాగృతిని పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి వి రమణ , మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, తాసిల్దార్ ఎల్ రామారావు , మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు, డాక్టర్లు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కమ్మవలస గ్రామంలో పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం



శివ – పార్వతి సంవాదం



గంగ – పార్వతి సంవాదం



ఉయ్యాల కంబాలాట లో పూజారి శంకర్రావు



ఒక నెల రోజులపాటు జరిగేఘటాల ఊరేగింపుకార్యక్రమంలో రజస్వల కాని బాలికలను ఎంపిక చేస్తారు. ఈ ఏడాది ఈ సేవకు ఎంపికైనవారు:



సిరిమానోత్సవం



విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం, కమ్మవలస గ్రామ ప్రజలుపైడితల్లి అమ్మవారి పండగను మిక్కిలి భక్తి, శ్రద్ధలతో, ఎంతోఉత్సాహంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో, చుట్టుప్రక్కలగ్రామ ప్రజలతో కలిసి జరుపుకున్నారు.

**వ్యవసాయ పండుగ...**

రైతులు పాడిపంటలు బాగా పండాలని, అందరూఆయురారోగ్యాలతో జీవించాలనే ఆకాంక్షతో, పాడిపంటల వృద్ధినికోరుతూ సుమారు నెల రోజుల పాటు పండుగ కార్యక్రమాలునిర్వహిస్తుంటారు.

గ్రామ ప్రజలందరికీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం ఎంతోవిశిష్టం. జీవితంలో ఒక్కసారైనా ఈ జాతరను చూడాలని ఆకాంక్షించేభక్తులు ఎంతో మంది ఉన్నారు. ఈసారి దాదాపు 19 సంవత్సరాలఅనంతరం, ఏప్రిల్ 15న పండగను ప్రారంభించి అమ్మవారినిఘనంగా ఆహ్వానించారు. అప్పటినుంచి నెల రోజుల పాటు ప్రతిసాయంత్రం ఘటాలను ఊరేగించారు. ఈ ఊరేగింపులో గ్రామప్రజలు తమ ఇంట్లో తయారు చేసిన ప్రసాదాలను ఘటాలలోసమర్పిస్తూ భక్తిని చాటారు. ఆచారం ప్రకారం, ఈ ఘటాలను గ్రామపూజారి తమ్మిరెడ్డి శంకర్రావు ఇంట్లో ఉంచుతారు.

పండగ ముగించడానికి ముందు వచ్చిన ఆదివారము నాడు గ్రామఆచారం ప్రకారం ఉయ్యాలకంబాల ఆడుతారు. గ్రామం లో ఒక చోటఉయ్యాల కట్టి, దళిత ప్రతినిధితో ప్రారంభించి, తరువాత పూజారి, ఘటాలు మోచే పిల్లలు, అమ్మవార్లు, గ్రామపెద్దలు ఊగి, గ్రామానికిశుభం జరగాలని కోరుకుంటారు.

సోమవారం నాడు, ఏర్పాట్లు చేసికొంటూ, రాత్రికి శివ భాగవతం అనేవీధి నాటకం ఏర్పాటు చేసారు.

పండుగలో అత్యంత ముఖ్యమైన ఘట్టం – సిరిమాను ఉత్సవం. మంగళవారం, పూజారిని సిరిమాను (రథం) లో కూర్చోబెట్టిఊరేగింపుగా తీసుకెళతారు. ఈ సందర్భంగా భక్తులు పూజారిమీదఅరటి పళ్ళు విసురుతూ, అమ్మవారికి సమర్పిస్తున్న ప్రసాదంగాభావిస్తారు. సిరిమాను ఉత్సవాలలో కళారూపాలకు కూడా ఎంతోప్రాధాన్యం ఉంది. అమ్మవారి వేషాలు, బిందెల నాట్యం, దుర్గావేషధారణ వంటి విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఊరేగింపులో ఘటాలు రథం వెనుక వెళుతూ ప్రతి ఇంటి ముందూఆగుతాయి. అక్కడ భక్తులు ముడుపులు, చీరలు, పసుపు, కుంకుమలను సమర్పిస్తారు. పూజారి ఆశీర్వచనాలుతో అక్షింతలుచల్లుతూ, అరటి పళ్ళు ప్రసాదంగా అందిస్తారు.

రథం సిద్ధం చేయడం కూడా ప్రత్యేకమైన ప్రక్రియ. పండగప్రకటించిన తరువాత వారం రోజులలో సిరిమానుకు ఉపయోగించేసూటిగా పెరిగిన "పాశి చెట్టు"ను ఎంపిక చేస్తారు. ఈ చెట్టునుస్వయంగా భక్తులు అమ్మవారికి సమర్పిస్తారు. ఈ సంవత్సరం ముత్తయ్యవలస గ్రామానికి చెందిన పిళ్ళా కుటుంబం చెట్టునుసమర్పించడం పుణ్యకార్యంగా భావించి అమ్మవారికి నివేదించారు. సిరిమాను తయారు చేయడానికి ""పాశి చెట్టు" ను మాత్రమే ఉపయోగించడానికి కారణం , దానికున్న సాగే గుణం, నిలువుగావుండడం. దీనిని రబ్బరు చెట్టు అని కూడా అంటారు. ఊరేగింపులోబరువు వలన విరగకుండా ఉంటుందని దీనిని తయారు చేసినవడ్రంగి సూదికొండ శ్రీను చెప్పారు. అలాగె రథం ముందుకుకదలాలంటే కొండదెవుపల్లి గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబ సబ్యులు వచ్చి లాగితే తప్ప ముందుకు కదలదు. ఈ 50 కుటుంబ సబ్యులు పైడి తల్లి అమ్మవారి మాన్యాలను (భూములు) సాగుచేసుకొని జీవిస్తుంటారు. ఈ ఆచారం బహుశాచుట్టుపక్కలనున్న గ్రామ ప్రజలసఖ్యతతో ఉండెందుకు, అందరూకలిసి మెలసి అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా జరుతుంది.

ఉత్సవం ముగిసిన తర్వాత సిరిమానును చిన్నచిన్న ముక్కలుగాచేస్తారు. దానిని రైతులు తీసుకుని వాటిని ఇంట్లో ఉంచుకునిపూజలు చేస్తారు. కొందరు తమ పొలంలో పూజించే చోటఉంచుతారు. అలాగే విత్తనాలతో పాటు పొలంలో వీటినివిసురుతారు. ఇదంతా కూడా మంచి పంటలు పండుతాయనేనమ్మకంతో చేస్తారు.

ఒక నెల రోజులపాటు జరిగే ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో రజస్వల కాని బాలికలను ఎంపిక చేస్తారు. ఈ ఏడాది ఈ సేవకు ఎంపికైనవారు:

కేతిరెడ్డి శ్రీవాణి (7వ తరగతి)

కోలా రుషిత (6వ తరగతి)

ఇట్రింజి దుర్గ (6వ తరగతి)

ఈ ముగ్గురు బాలికలు ఘటాలను తలపై ధరించి నాట్యం చేస్తూఎంతో శ్రద్ధతో సేవను నిర్వహించారు. గ్రామ ప్రజలు వారిని ప్రశంసలతోఅభినందించారు.

కేతిరెడ్డి శ్రీవాణి మాట్లాడుతూ, "నన్ను ఎంపిక చేయడం అమ్మవారిఆశీర్వాదంగా భావిస్తున్నాను," అనిబీ కోలా రుషిత, "ఈ సేవకిఅవకాశం రావడం నా అదృష్టం," అనిబీ. ఇట్రింజి దుర్గా, "ఇదిఅమ్మవారి ఆశీస్సుగా భావిస్తున్నాను," అని చెప్పారు. ప్రతి రోజు వీరిఅలంకరణను ఎల్లమ్మ అనే మహిళ ప్రత్యేకమైన చీర కట్టుతో ఎంతోఅందంగా నిర్వహించారు.

గ్రామ పూజారి తమ్మిరెడ్డి శంకర్రావు మాట్లాడుతూ, "19 సంవత్సరాల తర్వాత రెండవసారి పూజారిగా ఉండడం నా మహద్భాగ్యం. ఇలాంటి అవకాశాలు మళ్లీ రావాలని ఆశిస్తున్నాను," అన్నారు. గ్రామ ప్రజల సహకారం, పండగ కమిటీ సహకారంతో ఈ వేడుక విజయవంతమైందని చెప్పారు. ఇది తన పూర్వజన్మ సుకృతం అని భావిస్తున్నట్లు చెప్పారు.

ఈ పండుగ మొత్తం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగింది. కమిటీ సభ్యులుగా:

రెడ్డి రమాంజి, చప్ప రంగబాబు, తమ్మిరెడ్డి జనార్ధన, పెద్దింటి లక్ష్మణ, మరడాన నారాయణ రావు, కేతిరెడ్డి పూర్ణారావు, పూతి శ్రీరాం, చప్ప సత్యం, తమ్మిరెడ్డి రాము, కేతిరెడ్డి తవిటినాయుడు,రాగాల రామకృష్ణ, మరడాన శ్రీను, పెర్కొనగా, పర్యవేక్షణ బాధ్యతలను కడుపు జనార్ధనరావు చేపట్టారు.

కమిటీ సభ్యులు రెడ్డి రమాంజి, తమ్మిరెడ్డి జనార్ధన లుమాట్లాడుతూ, "ఎటువంటి విభేదాలు లేకుండా పండుగ ప్రశాంతంగా జరగడం ఆనందంగా ఉంది. కొన్ని చిన్న తప్పులు ఆచారాలపై అవగాహన లోపము వలన జరిగాయి. మున్ముందు వాటిని సరిచేసుకుంటాం," అన్నారు.

ఈ పండుగకు హాజరైన ఎమెల్యే బేబినాయన గారు మరియు మాజీ ఎమెల్యే శంబంగి చినప్పలనాయుడు గారు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.

బొబ్బిలి పోలీసులు – సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐలు మరియు 6మంది కానిస్టేబుళ్లు బందోబస్తు ఏర్పాట్లు సమర్ధవంతంగా నిర్వహించి, ఊరేగింపు ప్రశాంతంగా జరగడాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

**రిపోర్టర్:**
**చప్ప గాంధీ, కమ్మవలస గ్రామ వాసి, ప్రస్తుతం అమెరికా నివాసి.**

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com